9. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

ఆదివారం | రంగారెడ్డి , నల్లగొండ
సంపుటి :07 సంచిక : 271 , పేజీలు : 12 వెల:రూ.5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక
www.velthuru.com
velthuru Newspaper



## గవర్న్ జిష్ణుదేవ్ వర్మతో భట్టి భేటీ

**హైదరాబాద్,మార్చి7 వెలుతురు:**
మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీ పై వెళుతున్న జిష్ణు దేవ్ వర్మని లోక్ భవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలను పంచుకున్నారు. అలాగే ఇంతకాలం తెలంగాణ గవర్నర్గా ఇక్కడి అభివృద్ధిలో భాగమైనందుకు అభినందించారు. ఇటీవలి మార్పుల్లో జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా వెళుతున్నారు. తెలంగాణకు శుక్లా రానున్నారు.

## ఈ నెలాఖరులోగా లక్ష ఇళ్ల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

మంజూరు చేసిన అన్ని ఇండ్లు గ్రౌండింగ్ కావల్సిందే

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్దిదారులను గుర్తించండి

- మంజూరు చేసిన అన్నిఇండ్లకు చెల్లింపులు జరపాలి
- ప్రజా పాలన- ప్రగతి నివేదిక కార్యాచరణపై జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ల తో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 07:**
రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలిచేలా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తోందని, ఈ పథకం ఒక బెంచ్ మార్క్‌గా నిలవబోతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు 3.60 లక్షల ఇండ్లను మంజూరు చేయగా ఇందులో లక్ష ఇండ్లకు ఈనెల 31వ తేదీలోగా గృహప్రవేశాలు జరుగనున్నాయని తెలిపారు. ఇందుకోసం త్వరలోనే గృహప్రవేశాలకు అనుకూలమైన తేదీలను అధికారికంగా తెలియజేస్తామని తెలిపారు. ఇండ్లు మంజూరు చేసిన తర్వాత కూడా కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ పూరిగుడిసెలు కనిపిస్తున్నాయని, అటువంటి కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఇళ్ల నిర్మాణంలో చేర్చాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఇల్లు నిజంగా అవసరమైన వారికి చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు




## మహిళల రక్షణ సమాజం బాధ్యత

- వారి కోసం ఎన్నో చట్టాలు తెచ్చాం
- ఆర్థిక స్వావలంబన కోసం అనేక పథకాలు అమలు
- మహిళా వేధింపులను నిలదీసే సమాజం రావాలి
- స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి7 వెలుతురు:**
మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం. ఆర్టీసీలో వెయ్యి



బస్సులకు మహిళలే యజమానులు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. ఈ సందర్భహంగా మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతర్జాతీయ మహిళా



## వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీ నిధులు

- నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ
- విధివిధానాలు తయారుచేయాలి
- ఏప్రిల్ నెలాఖరు వరకు పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధం చేయాలి
- రెడ్కో సహకారంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు
- ఖరీఫ్ సీజన్ కోసం ముందుగానే ఎరువులు
- అధికారులను అదేశించిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్,మార్చి7( వెలుతురు):**
వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన సబ్సిడీ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసే విధానాన్ని

## శాంతియుత వాతావరణమే శ్రీరామరక్ష

గణపతి కూడా లొంగి పోవాలన్న సిఎం రేవంత్

- లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత
- 130 మంది మావోయిస్టులు లొంగుబాటు



**హైదరాబాద్,మార్చి7 వెలుతురు:**
శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు. 130 మంది మావోయిస్టులు



శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ



## రాష్ట్రపతినే అవమానిస్తారా ?

- ఇది సిగ్గుచేటైన విషయంగా పరిగణిస్తున్నాం
- ముర్ముకు బెంగాల్‌లో అవమానంపై మమతపై మోడీ ఆగ్రహం

**న్యూఢిల్లీ,మార్చి7( వెలుతురు):**
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమబెంగాల్‌లో పాల్గొనాల్సిన అంతర్జాతీయ సంతాల్ కాన్ఫరెన్స్

## రైతుబంధు ఇంకా ఎప్పుడిస్తారు

- మూడు పంటలకని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వరా
- కరీంనగర్ జిల్లాలో పర్యటించిన హరీష్ రావు

**కరీంనగర్,మార్చి7 వెలుతురు:**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర



ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి లేదా అని ప్రశ్నించారు. మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని గతంలో ఆయన చెప్పారని.. కానీ ఇప్పుడు తన హయాంలో మూడు పంటలకు రైతుబంధు ఎగొట్టారని ధ్వజమెత్తారు. శనివారం కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం

## ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

దానం , కడియంలపై తీర్పు రిజర్వ్

**హైదరాబాద్,మార్చి7( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాల్లో గత ఏడాది కాలంగా ప్రకంపనలు సృష్టిస్తున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు చివరిదశకు చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై



## హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచస్థాయి ఎఐ ఆర్థిక ఆవిష్కరణలు

- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**హైదరాబాద్,మార్చి7( వెలుతురు):**
కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు






## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.

- ఎద్దు ఏడ్చిన ఎవుసం - రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు.
- రైతు పోరుబాట కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

## అంతర్జాతీయ సంతాలి సభ వేదిక మార్పు

- రాష్ట్రపతిని స్వాగతించని మమత, మంత్రులు
- బెంగాల్ వ్యవహారంపై బహిరంగంగానే ముర్ము అసహనం
- మమత తన చిన్న చెల్లెలంటూ కితాబు



**కోల్‌కతా, మార్చి7(వెలుతురు):**
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం నాడు నార్త్ బెంగాల్‌లో అంతర్జాతీయ సంతాలి సదస్సును ప్రారంభించారు. అయితే తన పర్యటనలో పలు ప్రోటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసు

## ఎక్కడికి వెళ్లినా భారతీయ నిపుణులు



- ప్రపంచ దేశాల అభివృద్దిలో భారతీయుల పాత్ర
- గ్రీన్ ఎనర్జీలో స్వయం సమృద్ధితో పాటు, ఎగుమతికి అవకాశం
- త్వరలో రివర్స్ మైగ్రేషన్ కూడా సాధ్యమే
- సంతానోత్పత్తిని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది
- ఢిల్లీ సదస్సులో ఎపి సిఎం చంద్రబాబు నాయుడు

**న్యూఢిల్లీ,మార్చి7 వెలుతురు:**
నిపుణులు, వనరులు ఉన్న చోటుకే అవకాశాలు వెతుక్కుంటూ వచ్చే రోజులు వచ్చాయని, త్వరలోనే 'రివర్స్ మైగ్రేషన్'

# బీహార్ ప్రజలకు నితీష్ పాలనా అణిచివేతనా....?

నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవి నుండి అప్రతిష్ఠాకరమైన నిష్క్రమణ అది తాత్కాలికమైనప్పటికీ బిహార్‌లోని అత్యంత రాజకీయంగా నిర్ణాయకమైన ఓటర్ వర్గాలలో లోతైన మరియు ప్రమాదకరమైన ఆందోళనను బయటపెట్టింది. ఈబీసీ లు, ఓబీసీ లు మరియు మహాదళితులు జెడియు యొక్క ఎన్నికల లెక్కకు మూలస్తంభంగా ఉన్న సమాజాలు కేవలం అశాంతిలో లేవు. వారు విసర్జించబడినట్లు భావిస్తున్నారు.



## టి అవినాష్

**డైరెక్టర్ I&PR, AvT**

**గ్లోబల్ , న్యూ ఢిల్లీ**

ఇది ఎందుకు ముఖ్యమో అర్థం చేసుకోవాలంటే, నితీశ్ కుమార్ రాజకీయంగా ఉద్భవించడానికి దారితీసిన పరిస్థితులను తిరిగి పరిశీలించాలి. ఆర్జెడి యొక్క దశాబ్దపు ఆధిపత్యం ఆ సమాజాలకు పాలన కాదు అది అణచివేత. రాజ్య అధికారం ఒక సంకుచిత కుల వర్గానికి అనుకూలంగా క్రమపద్ధతిలో వినియోగించ బడింది, మిగతా వారిని స్వయంగా పోరాడేలా వదిలేసింది. నితీశ్ కుమార్ ఆగమనం అనేక విధాలుగా వారి రాజకీయ విముక్తి. ఆయన వారికి వ్యవస్థలో భాగస్వామ్యం కల్పించారు. అందుకే ఆయన అకస్మాత్తు రాజకీయ గ్రహణం అంత వ్యక్తిగతంగా అనిపిస్తోంది.

అదే మనస్తత్వం ఉత్తర ప్రదేశ్‌లో కూడా కనిపిస్తుంది. రాష్ట్రంలో బిజెపి యొక్క శక్తివంతమైన స్థానం, చాలావరకు, సమాజవాది పార్టీ పాలనలో పాదచీర్కులుగా పరిగణించబడడం పట్ల అలసిపోయిన వర్గాల మద్దతుతో నిర్మించబడింది. వారి అసంతృప్తులు బిహార్ వాటిని ప్రతిబింబించాయి అదృశ్యత, అభద్రత మరియు సాంస్థానిక నిర్లక్ష్యం. బిజెపి వారికి గుర్తింపు అందించింది. ఆ ఒప్పందం ఇప్పుడు నిశ్శబ్దంగా కానీ స్పష్టంగా ఒత్తిడిలో ఉంది.

బిహార్ అంతటా భగ్గుమన్న నిరసనలు ఢిల్లీకి కూడా వ్యాపించినవి కేవలం వీధి నాటకం కాదు. అవి స్పష్టమైన రాజకీయ సందేశాన్ని మోస్తున్నాయి: ఈ సమాజాలు కేవలం పాలన మాత్రమే కాదు ప్రాతినిధ్యం కావాలని డిమాండ్ చేస్తున్నాయి. దూరం నుండి తమ ప్రయోజనాలను నిర్వహించే నాయకుడు కాదు, తమ గుర్తింపును ప్రతిబింబించే నాయకుడు కావాలని వారు కోరుతున్నారు.

ఇక్కడే బిజెపి మరియు జెడియు యొక్క వ్యూహాత్మక సంకటం ఉంది. సంకీర్ణంలో ఆధిపత్య భాగస్వామిగా, బిజెపి ఈ కంపనాలను పక్కనే నిలబడి చూస్తూ ఉండలేదు. తన అత్యంత విశ్వసనీయ ఓటర్ల న్యాయమైన ఆకాంక్షలను ఇముడ్చుకోవడంలో విఫలమైన సంకీర్ణం రాత్రోరాత్రి విచ్ఛిన్నం కాదు కానీ అది క్రమంగా, నిశ్శబ్దంగా మరియు తిరిగిరాని విధంగా కోతకు గురవుతుంది. ఉత్తర ప్రదేశ్ ఎన్నికల అత్యున్నత పందెపు వేదికలో, బిజెపి అదే సమయంలో తన బ్రాహ్మణ మద్దతు వర్గం అన్యీకరణను కూడా నిర్వహిస్తున్న తరుణంలో, రాజకీయ లెక్కతప్పులకు అవకాశం అత్యంత సన్నగా ఉంది. గణితం క్షమించదు. బ్రాహ్మణుల విశ్వాసాన్ని మరియు ఈబీసీ - ఓబీసీ -మహాదళిత కలయికను ఒకేసారి కోల్పోతే, మీ ఎన్నికల సంకీర్ణం మూలం నుండి అస్థిరమవుతుంది. బిహార్ హెచ్చరిక మోగించింది. జెడియు మరియు బిజెపి వింటున్నాయా అన్నది పూర్తిగా వేరే ప్రశ్న.

# మనకు కావాలి, మరింత మంది జస్టిస్ బీవీ నాగరత్నలు!



## సాగర్ వనపర్తి,

**పాలసీ అనలిస్టు.**



*ప్రస్తుతం మన న్యాయ వ్యవస్థకు మరింత జస్టిస్ బీవీ నాగరత్నలు కావాల్సిన అవసరం ఎంతగానో ఉన్నది. ఆమె సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయినప్పటికీ నుంచి నేను వారి ప్రకటనలు, తీర్పులను నిశితంగా పరిశీలిస్తున్న. న్యాయ రంగంలో ఆమె ప్రతి పదం, పదబంధం స్త్రీ సాధికారితకు స్వాగతనీయంగానే ఉన్నది. పురుషాధిక్య న్యాయవ్యవస్థలో ఒక మహిళా న్యాయమూర్తి అలా మాట్లాడటం, నడుచుకోవడం నిజంగా సాహసోపేతమే. ఒక న్యా విద్యార్థిగా నేను నాగరత్నను ఆదర్శంగా తీసుకుంటాను. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా... బీవీ నాగరత్న ప్రతి న్యాయ విద్యార్థి, లాయరు, అడ్వకేట్, ప్లీడరు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సందర్భంగా న్యాయ వ్యవస్థలో మహిళ ఆవశ్యతను రాయాలని అక్షరీకరించాను.*

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, భారత న్యాయవ్యవస్థలో మహిళల పాత్ర గురించి మనమంతా ఒకసారి యోచన చేయడం అవశ్యం. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యంలోని అత్యంత ముఖ్యమైన భాగాల్లో ఒకటన్న విషయం తెలిసిందే. ఇది ప్రజల హక్కులను రక్షిస్తూ... న్యాయం జరిగేలా చూస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా భారత న్యాయవ్యవస్థలో మహిళల సంఖ్య కొద్దికొద్దిగా పెరుగుతూ వస్తున్నది. అయినప్పటికీ, ముఖ్యంగా ఉన్నత న్యాయస్థానాల్లో మహిళల సంఖ్య ఇంకా తక్కువగానే ఉండటం ఆందోళనకరం. ఈ విషయంపై పూర్తిగా తెలవాలంటే, కొంచం ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉన్నది. దేశ న్యాయవ్యవస్థలో మహిళల ముఖ్యమైన మజలీ ఒకటి 1989లో జరిగింది. ఫాతిమా బీవి భారత సుప్రీంకోర్టులో మొదటి మహిళా న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇది న్యాయవ్యవస్థలో లింగ సమానత్వానికి ఒక చారిత్రాత్మక అడుగుగా చెప్పవచ్చు. ఆమె నియామకం చాలా మంది మహిళలకు న్యాయశాస్త్రం చదవడానికి, న్యాయరంగంలో పనిచేయడానికి ప్రేరణనిచ్చింది. అయితే ఇన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య ఇంకా చాలా తక్కువగానే ఉంది.

ఇప్పటికీ భారతదేశంలోని సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో మహిళా న్యాయమూర్తుల సంఖ్య చాలా తక్కువ. హైకోర్టుల్లో మొత్తం న్యాయమూర్తుల్లో సుమారు 14 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఇది చూస్తే చాలా మంది మహిళలు న్యాయవాదులుగా మారుతున్నప్పటికీ, వారిలో కొద్దిమంది మాత్రమే అత్యున్నత స్థాయికి చేరుకుంటున్నారని అర్థమవుతుంది. జిల్లా కోర్టులలో పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉంది. జిల్లా మరియు దిగువ స్థాయి కోర్టుల్లో సుమారు 38 శాతం న్యాయమూర్తులు మహిళలే. అనేక రాష్ట్రాలు న్యాయ సేవల్లో మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం వల్ల ఈ సంఖ్య పెరిగింది. జిల్లా కోర్టులు చాలా ముఖ్యమైనవి, ఎందుకంటే ఎక్కువ మంది ప్రజలు మొదటగా న్యాయం కోసం ఈ కోర్టులనే ఆశ్రయిస్తారు. ఈ స్థాయిలో మహిళా న్యాయమూర్తులు ఉండడం న్యాయం అందుబాటులోకి రావడానికి ఎంతో సాయపడుతుంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో న్యాయవ్యవస్థలో మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటీవల సంవత్సరాల్లో తెలంగాణ హైకోర్టులో అనేక మంది మహిళా న్యాయమూర్తులు నియమితులయ్యారు. రాష్ట్రంలో చాలా మంది మహిళలు జిల్లా జడ్జీలు, మేజిస్ట్రేట్లు, ఫ్యామిలీ కోర్టు జడ్జీలుగా పని చేస్తుండటం హర్షణీయం. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసుల్లో వారు సమర్థంగా న్యాయం అందిస్తున్నారు. సమానత్వంతో కూడిన న్యాయవ్యవస్థ నిర్మించడానికి మహిళా న్యాయమూర్తులు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. గృహహింస, లైంగిక వేధింపులు, లింగ వివక్షకు సంబంధించిన కేసుల్లో వారి అనుభవం, అభిప్రాయాలు కేసు పరిష్కారానికి బాగా ఉపయోగపడుతుంది. కోర్టుల్లో మహిళల సంఖ్య పెరిగితే ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం కూడా పెరుగుతుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సమయంలో, జిల్లా కోర్టుల నుంచి హైకోర్టుల వరకు మహిళల పెరుగుతున్న సంఖ్య ఒక మంచి పరిణామాన్ని సూచిస్తున్నది. న్యాయవ్యవస్థలో మహిళల సంఖ్య పెరగడం మహిళలను శక్తివంతం చేయడమే కాకుండా, న్యాయవ్యవస్థను మరింత సమతుల్యంగా, సమాజాన్ని ప్రతిబింబించేలా చేస్తుంది. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో మహిళా న్యాయమూర్తుల సంఖ్య పెరుగుతుండటం అవకాశాలు, మద్దతు ఉంటే సామాజిక మార్పు సాధ్యమని మన దేశ పాలకులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీ నిధులు



అమలు చేసే అవకాశాలను పరిశీలించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతులు కొనుగోళ్లు చేసిన పనిముట్లకు 40 శాతం సబ్సిడీ నిధులను సదరు కంపెనీలకు అందించే పద్ధతి ఉంది అలా కాక, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ చేసే అవకాశాలను పరిశీలించి అందుకు తగ్గ విధివిదానాలను తయారు చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులకు సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను వచ్చే ఏప్రిల్ నెలాఖరు సిద్దంగా ఉంచుకోవాలని అందుకు తగ్గ ఏర్పాట్లు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఇందుకు రెడ్కో సంస్థ సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొదట ప్రయోగాత్మకంగా జంగారెడ్డిపల్లి మరియు జనంపేట రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి వాటి పనితీరును పరిశీలించిన తరువాత మొదటి దశలో రాష్ట్రంలోని 1600 రైతు వేదికలలో రెడ్కో ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఊనున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే తెప్పించి నిల్వ ఉంచేందుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన కూడ ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో వరి, పత్తి, మక్క వంటి ప్రధాన పంటల సాగు విస్తృతంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మక్క పంటకు వరి లేదా పత్తి పంటలతో పోలిస్తే యూరియా అవసరం దాదాపు మూడింతలు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. నీటి నిల్వలు సమృద్ధిగా ఉండటం, నేలలో తేమ నిల్వ ఉండటం, అలాగే దక్షిణ పశ్చిమ రుతుపవనాలు సాధారణంగా ప్రారంభమవుతాయనే అంచనాల నేపథ్యంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం సుమారు 60.60 లక్షల హెక్టార్లలో సాగు అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్?2026 సీజన్‌కు రాష్ట్రానికి 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.

# 99 రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

- **హౌసింగ్ బోర్డులోని 5వేల రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తిచేయాలి**
- **పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్,మార్చి7 వెలుతురు:**

ప్రజాపాలన- ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఊష్ట్రంలో ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను మంత్రి శనివారంనాడు సచివాలయంలో ప్రారంభించారు. అలాగే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ 99 రోజుల్లో హౌసింగ్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డ్ నిర్ధేశిరచుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డ్ పరిధిలో ఇండ్లు, ప్లాట్లు, స్థలాలను వాయిదాల రూపంలో కొనుగోలు చేశారని ఇందులో కొంతమంది అసలు మరికొంతమంది వడ్డీలు చెల్లించాలని, ఇంకొంతమంది వాయిదాల గడువు ముగిసిపోయిందని ఈ విధంగా దాదాపు ఐదు వేల మంది తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిఉందని ఈసందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. దీనిపై మంత్రిగారు స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ పోర్టల్ వల్ల ప్రజలు ఎవరూ అధికారుల చుట్టూ తిరగవలసిన అవసరం ఉండదని, పూర్తి సమాచారం పోర్టల్ లోనే ఉంటుందన్నారు. టాయింపుదారులు తమ రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణ మరియు ఇతర లావాదేవీల పర్యవేక్షణను ఒకే వేదిక ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చు.డిజిటల్ విధానం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, పౌరులకు సేవలు మరింత చేరువవుతాయి. ఇది హౌసింగ్ బోర్డు మరియు అలాటీల మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# పోలీసులతో టచ్‌లో మావో అగ్రనేత గణపతి ?

**లొంగిపోవాలని ఇప్పటికే సీఎం, డీజీపీల వినతి**



**హైదరాబాద్,మార్చి7( వెలుతురు):**

మావోయిస్టు అగ్రనేత గణపతి తెలంగాణ పోలీసుల టచ్‌లోకి వచ్చాడరిన సమాచారం. నిజానికి శనివారం లొంగిపోతాడని ప్రచారం జరిగింది. కానీ అలా జరగలేదు. అయితే వారం, పది రోజుల్లో గణపతి లొంగిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పోలీస్ బృందం నేపాల్, ఫిలిప్పీన్స్ వెళ్లనుంది. గణపతి పోలీసుల ముందు లొంగిపోతే రక్షణ కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మావోయిస్టు అగ్రనేత గణపతి లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి పిలుపు ఇచ్చిన గంటల్లోనే గణపతి పోలీసుల టచ్‌లోకి వచ్చాడంటూ వార్తలు రావటం గమనార్హం. ఇకపోతే నేటితో తెలంగాణ మావోయిస్ట్ రాష్ట్ర కమిటీ అంతర్థానమైంది డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. తెలంగాణకు చెందిన 7 మంది మావోయిస్టులు మాత్రమే మిగిలి ఉన్నారని, ఆ ఏడు మంది తెలంగాణలో కాకుండా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్నారని వెల్లడించారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. 'మావోయిస్టు అగ్రనేత గణపతి అజ్ఞాతంలో ఉన్నారు. ఆయన అనారోగ్య కారణాలతో అజ్ఞాతంలో ఉన్నట్టు సమాచారం ఉంది. లొంగిపో వాలని గణపతికి విజ్ఞప్తి చేస్తున్నాము. మావోయిస్టు అగ్ర నేతలు లొంగిపోవడంతో.. రాష్ట్ర కమిటీ నేతలు, కమిటీ సభ్యులు కూడా లొంగిపోవడానికి ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని లొంగిపోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అన్నారు. ప్రస్తుతం లొంగిపోయిన 130 మందిని వివిధ ప్రాంతాల నుండి తీసుకుని వచ్చాం. 130 మందిని ఒక చోట చేర్చడానికి మా డిపార్ట్‌మెంట్ తీవ్రంగా శ్రమించింది. లొంగిపోయిన మావోయిస్టులకు నిబంధనలకు అనుగుణంగా పునరావాసం కల్పిస్తాం' అని అన్నారు.

# నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు

## గృహప్రవేశాన్ని ప్రారంభించిన మహ్మద్ షబ్బీర్ అలీ

**కామారెడ్డి,మార్చి7( వెలుతురు):**

కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొని లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భిక్కనూర్ లక్ష్మీ, చిట్యాల రాజమణిలకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు లబ్దిదారులకు నిత్యావసర సరుకులు , వస్త్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కతో ఫోన్ ద్వారా మాట్లాడించి, లబ్దిదారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ , జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో కూలిపోయిన ఇళ్లను చూసి చలించిపోయి అధికారంలోకి రాగానే ఇళ్లను నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని



నిలబెట్టుకున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం చేయించడం ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లను కూడా త్వరలో పూర్తి చేసుకోవాలని లబ్దిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, గ్రామ సర్పంచ్ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం.. మహిళలకు వందనాలు !

భారతీయ సంస్కృతిలోనే స్త్రీలకు అత్యంత గౌరవం ఉంది. అనాదిగా స్త్రీని పరమ పూజ్యనీయంగా చూసే వారు. అందుకేనేమో మన ఇతిహాసంలో మహిళనే ఎక్కువగా గౌరవించేవారు. సతీ అనసూయ, సతీ అరుంధతి, సీత, సావిత్రి, ద్రౌపది ఇలా గౌరవప్రదమైన స్థానాల్లో స్రీలు ఉండేవారు. అమ్మవారిగా కూడా కాళీ, లక్ష్మీ, సరస్వతి, దుర్గా ఇలా పూజలు నిర్వహించేవారం. నదులకు కూడా గంగా, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ, పేర్లతో గౌరవించుకున్నాం. ఇంతటి ఉత్కృష్టత కలగిన మన చరిత్ర నుంచి మనం పక్కకు తప్పుకున్నామా అన్న బాధ కలుగుతోంది. స్త్రీని స్త్రీగా కాకుండా ఆటవస్తువుగా, భోగవస్తువుగా చూస్తున్న తీరుకు తలదించుకోవాలి. స్త్రీకి ఇప్పుడు గౌరవంగా చేస్తున్నందుకు సిగ్గుపడాలి. యత్రనార్యంతు పూజ్యంతే.. అన్న ఆర్యోక్తికి భిన్నంగా మన ప్రవర్తన, మన నడత మారడం ఆందోళనకరం. ప్రతియేటా అంతర్జాతీయ మహిళా దినోత్సవారుల జరుపుకుంటున్నా మార్పులు రావడం లేదు. సమాజంలో మృగాళ్లు విజృంభిస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోక పోవడం కూడా ఓ కారణం. మన సమాజం గతంలో ఇచ్చిన గౌరవాన్ని మళ్లీ పునరుద్దరించుకోవాల్సి ఉంది. మహిళలకు అన్నరంగాల్లో పెద్దపీట వేసేలా ప్రతిన తీసుకోవాలి. ఏటా అంతర్జాతీయ దినోత్సవాలను కాకుండా నిత్యం మనమంతా మహిళలను గౌరవించేలా మన సమాజాన్ని మార్చుకోవాలి. మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారు. వివిధ ప్రాంతాలలో ఈ ఆచరణ మహిళలకు గౌరవం, గుర్తింపు నిస్తోంది. ప్రేమల గురించిన సాధారణ




ఉత్సవం నుండి మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధనల ఉత్సవంగా వుంటుంది. సామ్యవాద రాజకీయ ఘటనగా ప్రారంభమై, వివిధ దేశాల్లో, ముఖ్యంగా తూర్పు ఐరోపా, రష్యా, పూర్వ సోవియట్ సమూహపు దేశాల సంస్కృతుల్లో భాగమైంది. ఇంకొన్ని ప్రాంతాలలో ఐక్యరాజ్యసమితి ఉద్దేశించిన విధంగా రాజకీయ, మానవీయ హక్కులు బలంగా వుండి ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ, సామాజికహక్కుల పోరాటంపై జాగృతి పెంచే విధంగా జరుపుతారు. ఈ రోజున కొంతమంది వంకాయ రంగు రిబ్బనులు ధరిస్తారు. ఓ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుంది. తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలదు. ఆమెలోని గొప్పదనం ఏంటంటే ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోనూ ఎన్నో పాత్రల్లో బాధ్యతగా ఇమిడి పోతోంది. సమాజంలో మగవారితో సమానంగా టీచర్, ఇంజనీర్, పైలెట్ వంటి బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వందశాతం వాటికి న్యాయం చేస్తుంది. అంతెందుకు యుద్దరంగంలోనూ మహిళ సమర్థంగా తన బాధ్యతలను నిర్వహిస్తోంది. అంటే ఆమెకు ప్రోత్సాహం అందిస్తే ..ఎంతటి పాత్రను అయినా అవలీలగా పోషించే శక్తి మహిళ సొంతం. నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్నంటాయి. వీటన్నింటికి ప్రతీకగా ప్రపంచంలోని మహిళల కోసం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'ని ఏర్పాటు చేశారు. ముందుకాలంతో పోల్చితే రోజురోజుకి మహిళలు ముందుకు సాగుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం. ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతుంది. ఈ రోజున వారు సాధించిన విజయాలకి గుర్తుగా వారిని గౌరివించే రోజు. నేడు అన్ని రంగాల్లోనూ ముందున్న మహిళలు.. తమ అద్భుత తెలివి, ఆలోచించే విధానంతో రోజురోజుకి పురోగతి సాధిస్తున్నారు. 1909 ఫిబ్రవరి 28న జాం న్యూయార్క్ నగరంలో అమెరికన్ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ నగరంలోని రెడీమెడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతని ఖండిస్తూ ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. దీని ప్రాముఖ్యతని చూసి ముగ్దులైన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని ఎందుకు జరుపుకోవాల్సిన అవసరం ఉందో చెప్పారు. కానీ, ఆ టైమ్‌లో ప్రత్యేకమైన రోజుని అనుకోలేదు. ఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐరాస నిర్వహించింది. సంస్థ సంబరాలు ప్రారంభించి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులని కాపాడి, వారు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవాలని కట్టుబడి ఉంది.లింగ సమానత్వాన్ని జరుపుకుంటారు. ఈ రోజున వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళల్ని గుర్తించి వారికి గౌరవిస్తారు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పడమే ముఖ్య ఉద్దేశ్యం.ఇక ఈ రోజున ప్రత్యేకమైన కొన్ని రంగుల దుస్తులు కూడా ధరిస్తారు. ఎక్కువగా ఊదారంగు(పర్పుల్), ఆకుపచ్చ, తెలుపు రంగుల వస్త్రాలని ధరిస్తారు. ఇక్కడ పర్పుల్ అంటే ఊదా రంగా న్యాయ, గౌరవానికి సూచనగా, ఆకుపచ్చ రంగు హామిని ఇస్తుంది. ఇక తెలుపు స్వచ్ఛతకి సూచనగా ధరిస్తారు. అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏ దేశానికి, సంస్థ, సంఘానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా దీనిని జరుపుకుంటారు. అమ్మ, గురువు, అక్క, చెల్లి,భార్య, ఇలాంటి ఎన్నో ముఖ్య పాత్రలు పోషిస్తున్న వారందరికీ ఈ రోజున కృతజ్ఞతలు అదే విధంగా అభినందనలు తెలపడం మన బాధ్యత. విధి. దీని వల్ల వారు అందించిన సేవలని మీరు గుర్తించినట్లుగా అవుతుంది. అందుకే మనమంతా మాతృమూర్తి అయిన స్త్రీలను గౌరవించడం అలవాటు చేసుకోవాలి. ఇంటినుంచే ఈ ఆచారం రావాలి. సమాజంలో ఆమె గౌరవాన్ని కాపాడాలి. అప్పుడే మన సంస్కృతిని ముందుకు తీసుకుని పోగలం. అంతేగాకుదు మహిళ లేకుంటే మనుగడ లేదని, సృష్టి లేదని గుర్తించాలి.

## 20వ శతాబ్దంలో మహిళా దినోత్సవానికి బీజం

### - మహిళల సమానత్వం కోసం జరిగిన పోరాటం




**న్యూఢిల్లీ,మార్చి7( వెలుతురు):**
మార్చి 8 మహిళలకు అంకితమైన రోజు. ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటారు. మహిళలు దేనిలోనూ తక్కువ కాదంటూ.. లింగ సమానత్వాన్ని తెలియజేస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళలు వేడుకలను జరుపుకుంటారు. మానవజాతి మనుగడకు ప్రాణం పోసే మహిళ.. ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం.. అన్నింటా సగం అంటూ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలు సాధిస్తున్నారు.. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. స్త్రీ కుటుంబానికి కళ్ళు, ఇంటికి దీపం ఇల్లాలు.. ఒకప్పుడు నాలుగు గోడలకే పరిమితమైన మహిళలు నేడు అన్వేషించని రంగం లేదు. మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా నిలుస్తున్నారు. తాను ఎంచుకున్న రంగంలో తమదైన ముద్ర వేస్తూ విజయాలు అందుకుంటున్నారు. తాము ఎవరికీ తీసిపోనని నిరూపించుకుంటున్నారు. వివిధ రంగాలలోని మహిళలు సాధించిన విజయాలను గుర్తించడానికి, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం 20వ శతాబ్దం ప్రారంభంలో ప్రారంభమైంది. ఈ దినోత్సవ వేడుకలు ఉత్తర అమెరికా, యూరప్‌లోని కార్మిక ఉద్యమాల నుంచి ఉద్భవించాయి. మొదటి జాతీయ మహిళా దినోత్సవాన్ని యునైటెడ్ స్టేట్స్‌లో ఫిబ్రవరి 28వ తేదీ, 1909 జరుపుకున్నారు. 1908లో న్యూయార్క్‌లో జరిగిన వస్త్ర కార్మికుల సమ్మె జ్ఞాపకార్థం సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. న్యూయార్క్‌లో సోషలిస్ట్ మహిళలు, వస్త్ర కార్మికులు తక్కువ పని గంటలు, అధిక వేతనాలు, ఓటు హక్కును డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అలా మహిళా దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. అవును యూరోపియన్ కార్యకర్తలు మహిళలకు ప్రత్యేక రోజును కేటాయించాలని ప్రచారం ప్రారంభించారు. తమ ఓటు హక్కును డిమాండ్ చేశారు. అంతేకాదు సమాన వేతనం, పని హక్కుల కోసం నాయకత్వం వహించారు. ఈసారి ఈ ర్యాలీలలో పది లక్షల మందికి పైగా పాల్గొన్నారు. తరువాత 1910లో కోపెన్‌హాగన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో క్లారా జెట్కిన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతిపాదించారు. ఆ ఆలోచన ఆమోదించబడింది.

## బీర్‌బాటిల్‌లో చేపపిల్ల

**హైదరాబాద్,మార్చి7( వెలుతురు):**



బీర్ తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. బీర్ బాటిల్‌లో ఓ చేపపిల్ల ఈదుతూ కనిపించింది. హైదరాబాద్ నాచారం పరిధిలోని మల్లాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మల్లాపూర్‌లోని జేపీ వైన్ షాపులో ఓ వ్యక్తి శుక్రవారం నాడు కింగ్‌ఫిషర్ లైట్ బీర్ కొనుగోలు చేశాడు. దాన్ని తాగేందుకు మూత ఓపెన్ చేయగానే అందులో చేప పిల్ల కదులుతూ కనిపించింది. దీంతో ఒక్కసారిగా అవాక్కయిన కస్టమర్.. వెంటనే షాపు నిర్వాహకుడిని ప్రశ్నించాడు. అయితే అతనితో వైన్ షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. బీర్లు తాము తయారుచేయమని.. ఏదైనా ఉంటే తయారుచేసిన కంపెనీని అడుక్కోవాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో బీర్ బాటిల్‌లో చేప కదలడాన్ని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు.

## పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు.. అది ప్రభుత్వాల భిక్ష కాదు

### సుప్రీం కోర్టు(17- 12-1982 జడ్జిమెంట్) పెన్షనర్లకు ఇచ్చేవి బెనిఫిట్స్ కాదు.. అవి వారికి ఇవ్వాల్సిన బకాయిలు. సిఎం గారూ.. పెన్షనర్ల బకాయిలు వెంటనే ఇవ్వండి.



**ఇంజమూరి రఘునందన్,**
పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు
(సెల్:9866102962)

నిన్న ఒక సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడానికి కూడా ఖజానా ఖాళీగా ఉంది. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని, ప్రతి నెల వెయ్యిమంది యావరేజ్ గా రిటైర్ అవుతున్నారని వారికి ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాల్సి వస్తుంది. అయినా ఎదో ఒక రకంగా సమన్వయం చేసుకొని ఈ ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నాం అని అన్నారు. అయితే ముఖ్యమంత్రి గారు సమాచార లోపంతో కావచ్చు తాను మాట్లాడిన మాటల్లో అవాస్తవం ఉంది. వారు మాట్లాడిన మాటలు ప్రజలందరూ విన్నారు.వారు మాట్లాడిన అవాస్తవం ఏమిటి అంటే... మొదటిది రిటైర్ అయిన ఉద్యోగికి ఇచ్చేవి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కావు. అవి రిటైర్ అయిన ఉద్యోగికి రావలసిన "రిటైర్మెంట్ బకాయిలు." రెండవది ప్రతి రిటైర్ అయిన ఉద్యోగికి ఇచ్చేది ఒక కోటి రూపాయలు అనేది అవాస్తవం. యావరేజ్ గా 35 లక్షల నుండి 50 లక్షల వరకే పెన్షన్ బకాయిలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇది ప్రజలు అర్థం చేసుకోవాలని కోరుచున్నాము. ముఖ్యమంత్రి గారు కూడా సరైన సమాచారం తెప్పించుకుంటే బాగుంటుంది. రిటైర్ అయిన ప్రతి ఉద్యోగి యావరేజిగా 30 నుండి 35 సంవత్సరాలు సర్వీసు చేస్తే ప్రభుత్వం గుడ్ విల్ గా ఇచ్చేది ఒక్క గ్రాట్యుటీ మాత్రమే. మిగిలినవన్నీ వారు తమ సర్వీసు కాలంలో దాచుకున్న తమ సొమ్ములు మాత్రమే! అవేంటో కాస్త వివరంగా తెలుసుకుందాం.

1. జీపిఎఫ్: తమ సర్వీసు కాలంలో తమ వేతనాల నుండి జనరల్ ప్రావిడెంట్ ఫండ్ లో నెల నెలా కొంత మొత్తం సొమ్మును దాచుకొంటారు. అట్లా జమ అయిన మొత్తాన్ని రిటైర్మెంట్ సమయంలో ఇవ్వాలి. దీన్నే జీపిఎఫ్ ఫైనల్ పేమెంట్ అంటారు. ఇది ఉద్యోగుల సొమ్మే.

2. లీవ్ ఎన్కాష్మెంట్: రెగ్యులర్ ఉద్యోగులకు(నాన్ వెకేషన్ డిపార్ట్మెంట్) సంవత్సరానికి వారు పనిచేసిన కాలానికి 30 రోజుల సంపాదిత సెలవులు ఇస్తారు. ఉపాధ్యాయులు వెకేషన్ డిపార్ట్మెంట్ కాబట్టి వారికి సంవత్సరానికి 6 రోజులు సంపాదిత సెలవులు ఉంటాయి. వేసవిలో ప్రభుత్వం ఉపాధ్యాయుల సేవలు ఉపయోగించుకున్నందుకు పరిహారంగా అపుడపుడు సంపాదిత సెలవులు మంజూరు చేస్తుంది. రిటైర్మెంట్ నాటికి వాడుకోకుండా మిగిలి ఉన్న సంపాదిత సెలవులు, అర్థవేతన సెలవులు అన్ని ప్రభుత్వానికి సరెండర్ చేయగా కొంత మొత్తం డబ్బు ప్రభుత్వం చెల్లిస్తుంది. దీన్నే లీవ్ ఎన్కాష్మెంట్ అంటారు. ఇది ప్రభుత్వం అదనంగా ఇచ్చేది కాదు. చట్ట ప్రకారం తమకు రావలసిందే!

3. ఇక కమ్యుటేషన్ ఆఫ్ పెన్షన్: ఇది కూడ ప్రభుత్వం అదనంగా ఇచ్చేది ఏమీ కాదు. తమకు రావలసిన పెన్షన్ నుండి కొంత పెన్షన్ ను అమ్ముకోగా వచ్చేదే కమ్యుటేషన్ ఆఫ్ పెన్షన్. అమ్ముకోగా వచ్చిన మొత్తాన్ని సమాన వాయిదాల్లో నెల నెలా చెల్లించే పెన్షన్ నుండి మినహాయిస్తారు. ఈ మొత్తాన్నే "కమ్యుటేషన్ వాల్యూ ఆఫ్ పెన్షన్" లేదా సివిపి అంటారు. ఒకరకంగా ప్రభుత్వం దగ్గర అప్పు తీసుకున్నట్లు. నెల నెలా జవూ అంటే జువీ× రూపంలో పెన్షనర్ పెన్షన్ నుండి కట్ అవుతుంది. ఈ సౌలభ్యం ఎందుకోసం పెట్టారంటే రైటర్ అయిన ఉద్యోగులకు గృహావసరాలు, పిల్లల పెళ్లిళ్లు, విద్యా అవసరాలకోసం ఫిక్స్ అయిన పెన్షన్ నుండి కొంత అమ్ముకొని వచ్చిన పెద్ద మొత్తం వాడుకోవడానికి ఈ వెసులుబాటు కల్పించారు. రిటైర్ అయిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ఇబ్బందులు పడవద్దని వారి సంక్షేమం కోసం పెట్టిందే ఇది.

4. గ్రూప్ ఇన్సూరెన్స్(జిఐఎస్): ఈ నిధికి ఉద్యోగుల మూలవేతనం ఆధారంగా ప్రతినెల వాళ్ళ వేతనాలనుండి కొంత మొత్తం మినహాయిస్తారు. రిటైర్ అయిన నాడు జమ అయిన మొత్తం చెల్లించాలి.

5. తెలంగాణ గవర్నమెంట్ లైఫ్ఇన్సూరెన్స్(టిజీఎల్ఐఎఫ్): ఇది కూడా ఉద్యోగుల కోసమే ఏర్పాటుచేసిన ఇన్సూరెన్స్ స్కీమ్. ప్రతినెల వారి వారి మూల వేతనాల ఆధారంగా వాళ్ళ వేతనాల నుండి మినహాయిస్తారు (డిడక్ట్ చేస్తారు).

ఇట్లా చూస్తే ఉద్యోగ ఉపాధ్యాయులకు వారు రిటైర్ అయినప్పుడు ఇవ్వాల్సినవన్నీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కాదు. అవి రిటైర్మెంట్ బకాయిలు మాత్రమే! కానీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రజల్లో అపోహలు కలిగేలా ఒక్కో రిటైర్ అయిన ఉద్యోగికి కోటి రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి ఉంటుందని అనడం సరైంది కాదని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఇంజమూరి రఘునందన్ అన్నారు. ఇవన్నీ ఉద్యోగి రిటైర్ అయినప్పుడు చట్టబద్ధంగా చెల్లించాల్సిన చెల్లింపులు తప్ప మరేం కావని వారన్నారు. సుప్రీం కోర్టు కూడా అనేక సందర్భాల్లో పెన్షన్ అనేది ఉద్యోగులకు ఇచ్చే భిక్ష కాదని, పెన్షన్ అనేది వారి చట్టబద్ధ హక్కని నొక్కి వక్కాణించింది.

ఇప్పటి వరకు మార్చి 2024 నుండి తమకు రావలసిన రిటైర్మెంట్ బకాయిలు అందక వివిధ ఆర్థిక ఇబ్బందులతో 61 మంది పెన్షనర్లు చనిపోయారు. భారత రాజ్యాంగం ప్రకారం మనది సంక్షేమ రాజ్యం(ఇండియా ఈజ్ వెల్ఫేర్ సొసైటీ). కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని భారత్ జోడో యాత్ర నిర్వహించినప్పుడు వేలాది ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ప్రత్యక్షంగానో పరోక్షంగానో యాత్రలో భాగస్వాములయ్యారు. ఈ ప్రభుత్వం రావడానికి కారణమయ్యారు. ఇది దాచేస్తే దాగని సత్యం కదా! అలాంటి పెంషనర్లకు అన్యాయం చేయకండి. వారు పడుతున్న మనో వ్యధను అర్థం చేసుకోండి. చనిపోయిన 61 మంది పెన్షనర్ల ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుందాం. వీరి మరణాలకు బాధ్యత ఎవరు వహిస్తారు ముఖ్యమంత్రి గారు. మిస్ వరల్డ్ పోటీలు, ఫుట్ బాల్ ప్లేయర్ మెస్సి, తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, చిన్న దూరాలకు హెలికాప్టర్ పర్యటనలు ఇత్యాది కార్యక్రమాలు అన్నీ చేస్తున్న మీకు ఈ రిటైర్ అయిన.. అవుతున్న విశ్రాంత జీవుల సంక్షేమం పట్టదా! విశ్రాంతి తీసుకోవలసిన సమయంలో ధర్నాలు, ర్యాలీలు, నిరహార దీక్షలు చేయాల్సి వస్తుంది. విశ్రాంత జీవితం గడపాల్సిన సమయంలో ఆందోళన, ఆవేదన తో అసువులు పాయాల్సివస్తుంది. ఇది మీ పాలనకు క్షేమకరం కాదు.

***కాస్త మా వైపు ఒక చూపు చూడండి సర్..***
***కోటి రూపాయలు అని మమ్మల్ని బద్నాం చేయకండి సర్....***

## విడాకులు వచ్చేవరకు విజయ్ ఇంట్లోనే ఉంటాను

- **అలా ఉండేందుకు ఆదేశాలు ఇవ్వండి**
- **కోర్టును కోరిన విజయ్ భార్య సంగీత**
- **తన వ్యక్తిగత జీవిత చికాకులపై స్పందించిన విజయం**
- **కార్యకర్తలు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాని సూచన**

చెన్నై,మార్చి7 **వెలుతురు :**
తమిళ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ నుంచి విడాకులు కోరుతూ పిటిషన్ వేసిన ఆయన భార్య సంగీత తాజాగా మరో పిటిషన్ వేశారు. నివాస హక్కులు కోరుతూ ఈ పిటిషన్ వేశారు. వివాహం తర్వాత తాము కలిసి నీలాంగరైలో నివసించిన వైవాహిక గృహంలో ఉండేందుకు తనకు అనుమతి ఇవ్వాలని కోరుతూ చెంగల్పట్టులోని జిల్లా కోర్టును ఆమె ఆశ్రయించారు. దీనిపై తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. విజయ్ నుంచి విడాకులు కోరడంతో ఇంట్లో ఉండేందుకు తనకు అనుమతి ఇవ్వడంలేదని కోర్టుకు సంగీత తెలిపారు. తాను లండన్‌కు చెందిన వ్యక్తిని కావడంతో మరెక్కడా ఉండేందుకు అనుమతి లేదన్నారు. తనకు విజయ్ ఇంట్లో ఉండే హక్కు ఉందని కోర్టుకు వివరించారు. విడాకుల ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ నీలాంగరై ఇంట్లో ఉండేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. సంగీత ఇటీవల 28 ఏళ్ల తమ వైవాహిక జీవితానికి ఉద్వాసన పలుకుతూ వివిధ కారణాల రీత్యా విడాకులు ఇవ్వాలని ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. విజయ్‌కు వివాహేతర సంబంధం ఉందని, అది తనకు తన పిల్లలకు అవమానంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఏప్రిల్ 20న ఈ కేసు విచారణకు రానుంది. యూకేకు చెందిన సంగీత లండన్‌లో చదువుకున్నారు. 1999 ఆగస్టు 25న విజయ్‌ను వివాహమాడారు. వీరికి సంజయ్ అనే కుమారుడు, దివ్య అనే కుమార్తె ఉన్నారు. తనపై ముసురుకున్న వివాదాలపై సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎట్టకేలకు స్పందించారు. ఆ సమస్యల కారణంగా అభిమానులు, ప్రజలు ఇబ్బంది పడుతుంటే బాధగా ఉందని వ్యాఖ్యానించారు. టీవీకే ఆధ్వర్యంలో చెన్నై సమీపంలోని చెంగల్పట్టు వద్ద నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో విజయ్ పాల్గొని మాట్లాడారు. వ్యక్తిగత వివాదాల గురించి తాను చూసుకుంటానని, పార్టీ కార్యకర్తలంతా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. మహిళలకు ప్రత్యేక వరాలు ప్రకటిస్తూ మేనిఫెస్టో విడుదల చేశారు. ఇటీవల నాకు ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందుల గురించి మీరు ఆలోచించాల్సిన పనిలేదు. వాటిపై మీరు పోరాటం చేసి వాళ్లను బాధించాల్సిన అవసరం అంతకన్నా లేదు. అవన్నీ నేను చూసుకుంటాను. మీరు చేయాల్సిందల్లా ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే. నా వ్యక్తిగత విషయాలను ఎలా పరిష్కరించుకోవాలో నాకు బాగా తెలుసు. ఇవన్నీ మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంటే నాకు బాధగా ఉంది. వాటి సంగతి తర్వాత చూస్తా అని మహిళా దినోత్సవ కార్యక్రమంలో విజయ్ అన్నారు.

https://epaper.velthuru.com

హైదరాబాద్ - రంగారెడ్డి వెలుతురు

# కేంద్ర ప్రభుత్వం బీసీ కుటుంబాల వివరాలు కూడా ప్రత్యేకంగా నమోదు చేయాలి

**- మా బీసీ కుటుంబాల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయకుంటే జనాభా లెక్కలను బహిష్కరిస్తాం.**

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 07:** కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టే జనగణనలో బీసీ కుటుంబాల వివరాలను కూడా ప్రత్యేకంగా నమోదు చేయాలని లేనిపక్షంలో బీసీలు జనాభా లెక్కలను బహిష్కరించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పిలుపునిచ్చారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 1 ఏప్రిల్ 2026 నుంచి 30 డిసెంబర్ 2026 వరకు తొలి దశ జనగణనను చేపడుతున్నట్లు ప్రకటించిందని ఆ జనగణలో బీసీల ఊసే లేదని లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 33 ప్రశ్నలతో కూడిన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని అందులో ఉన్నటువంటి 12వ కాలంలో ఇంటి యజమాని ఎస్సీ నా ఎస్టీ మరియు ఇతరుల అని చేర్చారు గానీ బీసీ అని ప్రత్యేకంగా ప్రస్తావించలేదని అన్నారు. బీసీల జనాభా లెక్కలు లేకపోవడంతో మనకు రావాల్సిన వాటా అందడం లేదని పేరుకే జనాభాలో అరవై శాతం పైగా ఉన్నాం కానీ విద్యా ఉద్యోగ రాజకీయాల రంగాల్లో మన జనాభా దామాషా ప్రకారం వాటా దక్కడం లేదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం గెజిట్లో బీసీలను కూడా చేర్చి ప్రత్యేకంగా లెక్కించాలని అన్నారు.

# హయత్ నగర్ నారాయణ స్కూల్ లో ఘనంగా(SLC) స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్.





**హయత్నగర్ వెలుతురు మార్చి 07:** శుక్రవారం రోజున హయత్నగర్ నారాయణ పాఠశాలలో SLC స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విధ్యార్థులు ఇంగ్లీషు, గణితం, తెలుగు జనరల్ అవగాహన తదితర అంశాలపై ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి, విద్యార్థులు తమ విద్యా ప్రగతి ప్రాజెక్టులు నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు స్వయంగా వివరించారు. ధైర్యంగా మాట్లాడి తమ ప్రతిభను ప్రదర్శించిన విధ్యార్థుల ప్రదర్శన చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు విద్యార్థుల తల్లిదండ్రులు నారాయణ విద్యాసవస్థల నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జో. ఎం గోపాల్ రెడ్డి ఏ. జియం రవీంద్ర బాబు గారు ఆర్.ఎన్.డి మీనా మరియు ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ ప్రియాంక, బ్రాంచ్ ప్రిన్సిపల్ లావణ్య, మానస, వైస్ ప్రిన్సిపల్ కవిత, లావణ్య గార్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లి గజిటెడ్ భవన్ లో టి డి ఏ ల మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి



**బషీర్ బాగ్ వెలుతురు 7 మార్చి :** TDAOల ఆధ్వర్యంలో నాంపల్లి తెలంగాణ గజిటెడ్ భవన్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు ఆటలాడుతూ పాటలు పాడుతూ సంతోషాన్ని వెలిబుచ్చుతూ అందరూ అక్కడ ఆనందాన్ని పంచుకున్నారు ఃణాూాల రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్. షోకాత్ హుస్సేన్ ప్రధాన కార్యదర్శి. ప సుమతి రేఖ గారు పార్టిసిపెంట్స్ శ్రీమతి. ఉషారాణి గారు శ్రీమతి. అనురాధ గారు. శ్రీమతి సునీత గారు, శ్రీమతి. వెంకటరమణ గారు, శ్రీమతి. లక్మీబాయి గతు, శ్రీమతి పుష్పలత గారు ఇతర ణూా లు అందరూ పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి వేగవంతం లక్ష్యంగా ప్రజాప్రతినిధులకు శిక్షణ



**శంకర్పల్లి, వెలుతురు మార్చి 7 :** ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతుల వలన గ్రామాభివృద్ధికి దోహదం అవుతుందని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ అన్నారు. ఉప సర్పంచ్‌లు మరియు వార్డు సభ్యుల కోసం మోకిలలోని రైతు వేదికలో నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారంతో విజయవంతంగా ముగిశాయి. శిక్షణ పూర్తి చేసిన ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు ధ్రువీకరణపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు పంచాయతీ రాజ్ చట్టాలు, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ పథకాలు, అలాగే ఆర్థిక నిర్వహణపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామ పరిపాలన, అభివృద్ధి పనుల అమలు, పంచాయతీ నిధుల వినియోగం, మరియు ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించే విధానాలపై వివరించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీ సమావేశాల నిర్వహణ విధానం, వార్డు సభ్యుల బాధ్యతలు మరియు గ్రామాభివృద్ధిలో వారి పాత్రపై ప్రత్యేకంగా చర్చించారు. అదేవిధంగా పంచాయతీ అకౌంటింగ్ రూల్స్, నిధుల సమర్థ వినియోగం, అలాగే ఉప సర్పంచ్‌లు మరియు వార్డు సభ్యుల చట్టపరమైన హక్కులు, అధికారాలు, విధులపై అధికారులు స్పష్టత ఇచ్చారు. ఈ శిక్షణ ద్వారా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సమర్థవంతమైన పాలనను అమలు చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ గిరిరాజు డ్యూటీలు చరణ్ తేజ్ రామకృష్ణ రమేష్ ఆయా గ్రామాల ఉపసర్పంచులు వార్డు సభ్యులు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జీఎస్టీ, ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపులపై అవగాహన సదస్సు

**- తెలంగాణ టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్**






**నాంపల్లి మార్చి 07 ( వెలుతురు ):** హైదరాబాద్ నాంపల్లిలోని ఫ్యాప్సీ భవన్‌లో తెలంగాణ టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎస్టీ, ఆదాయపు పన్ను అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 500 మంది టాక్స్ ప్రాక్టీషనర్లు మరియు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు కమర్షియల్ టాక్స్ కమిషనర్ రఘునందన్ రావు , కమర్షియల్ టాక్స్ రిటైర్డ్ జాయింట్ కమిషనర్ పీవీ సుబ్బా రావు లు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ పన్ను చట్టాలపై నిరంతర అవగాహన పెంపొందించుకోవడం ప్రతి టాక్స్ ప్రాక్టీషనర్‌కు అత్యంత అవసరమన్నారు. రాష్ట్ర ఆదాయంలో జీఎస్టీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. టాక్స్ పేయర్స్ మరియు ప్రభుత్వానికి మధ్య టాక్స్ ప్రాక్టీషనర్లు ఒక వారధి లాగా పనిచేస్తారని ఆయన అన్నారు. టాక్స్ పేయర్స్‌కు సరైన మార్గదర్శకత్వం అందించి ప్రభుత్వానికి రెవెన్యూ పెరుగుదలకు దోహదపడే విధంగా వ్యవహరించాలని సూచించారు. జీఎస్టీపై ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పన్ను వ్యవస్థపై స్పష్టత పెరుగుతుందని తెలిపారు. సదస్సులో జీఎస్టీ, ఆదాయపు పన్ను చట్టాలలో జరిగిన తాజా మార్పులు, ప్రాక్టికల్ సమస్యలు మరియు వాటి పరిష్కారాలపై నిపుణులు విస్తృతంగా చర్చించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు నిపుణులతో చర్చించి తమకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని పొందారు. సదస్సు కాన్ఫిరెన్స్ చైర్మన్ గా నర్సీ రెడ్డి వ్యవహరించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లపోలు హరనాథ్ రెడ్డి , వైస్ ప్రెసిడెంట్లు హుస్సేన్ వలి , రాజ శేఖర్ రెడ్డి , జనరల్ సెక్రటరీ బీ.రమేష్ , ట్రెసరర్ రామా రావు , జాయింట్ సెక్రటరీలు శ్రీనివాస్ , జీ.రమేష్ ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

# ఘనంగా 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం







**ఖమ్మం రూరల్ వెలుతురు మార్చి 07:** ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశం ప్రధానోపాధ్యాయులు ఆమంచి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రూరల్ మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జగదీష్,సర్పంచ్ బండి సతీష్,ఉప సర్పంచ్ షేక్ దావూద్,మాజీ ఏఏపిసి చైర్మన్ పప్పుల విజయ,మాజీ ఎస్ ఎం సి చైర్మన్ పప్పుల రమణ,మాజీ జెడ్పీటీసీ పెరుమాళ్లపల్లి మోహనరావు లు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు ప్రతి సంవత్సరం కల్పిస్తున్నామని,గత ఏడాది 10వ తరగతి లో 100శాతం ఉత్తీర్ణత సాధించామని వారందరికీ ఇచ్చిన మాట ప్రకారం ప్రోత్సాహకాలను, నగదు బహుమతులను అందజేశామని, ఈ సంవత్సరం కూడా మంచిగా చదువుకొని గ్రామానికి,గురువులకు,తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పప్పుల రమాదేవి రిటైర్డ్ ఉద్యోగి ప్రతి సంవత్సరంలానే ఈసారి కూడా విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్ లు ,పెన్నులు అందించారు. గతేడాది ఉత్తీర్ణత సాధించిన మొదటి,రెండవ,మూడవ స్థానంలోని విద్యార్థులకు మాజీ జెడ్పీటీసీ మోహనరావు 3వేల 500 నగదును అందజేశారు. 2వ వార్డు సభ్యులు తంగెళ్లపల్లి నారాయణమ్మ విద్యార్థులకు కంపాస్ బాక్స్, స్కేల్స్,పెన్సిల్స్ అందజేశారు. అలాగే కొత్తగా ఎన్నికైన ఏఏ పిసి చైర్మన్ రమాదేవి కి స్వాగతం పలుకుతూ మాజీ చైర్మన్ విజయకు వీడ్కోలు సన్మానం చేసిన అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగులమీరా,సీనియర్ జర్నలిస్ట్ వేణుగోపాల్,రిటైర్డ్ ఆర్.ఐ. కనకయ్య,ఉపాధ్యాయులు సతీష్,పార్వతి,కమల,వార్డు సభ్యులు కందుల భాస్కర్,గుండె తిరపయ్య, మోత్కురి లక్ష్మయ్య,విద్యార్థిని,విద్యార్థులు,ఆఫీస్ సబార్డినేట్ రఫీ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పండుగలకు అసలైన గుర్తింపు గౌరవం నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉనికిని కోల్పోతున్న పండుగలు

**- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**






**కుత్బుల్లాపూర్ మార్చి 07 (వెలుతురు ప్రతినిధి):** 129 – సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నందు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మతాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ రంజాన్ తోఫా, బతుకమ్మ చీరలు, క్రిస్మస్ గిఫ్ట్ లతో ప్రజా రంజక పాలన నాటి బిఆర్ఎస్ ప్రభుత్వానిదయితే, పండుగలను విస్మరిస్తూ బడ్జెట్లో కనీస కేటాయింపులు లేకుండా ప్రజలను గోస పెడుతున్న ప్రజా కంతక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రంజాన్ మాసం అనేది ఆత్మపరిశుద్ధి, సహనం, దానం మరియు సోదరభావానికి ప్రతీక అన్నారు. ఉపవాస దీక్ష ద్వారా మనిషి తనలోని మంచితనాన్ని పెంపొందించుకుంటాడని, సమాజంలో ప్రేమ, ఐక్యత పెరగాలని ఈ పవిత్ర మాసం మనకు సందేశం ఇస్తుందని తెలిపారు. ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మైనారిటీ సోదరులు,పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన విద్యార్థిని సన్మానించిన కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 7** కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం బాన్సువాడ గ్రామానికి చెందిన విద్యార్థి శశిధర్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సన్మానించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో ప్రతిభ కనబరుస్తున్న శశిధర్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ చాటుకున్నాడన్నారు. ఇప్పటివరకు శశిధర్ 15 సార్లు రాష్ట్ర స్థాయి పోటీలలో, 7 సార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఇటీవల 14.02.2026 నుండి 19.02.2026 వరకు ఇండోనేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ టెస్ట్ సిరీస్‌లో ఇండియా జట్టు తరుపున పాల్గొని బంగారు పతకం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడనీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశిధర్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో ప్రపంచ స్థాయిలో కూడా రాణించేలా కృషి చేయాలని సూచించారు. జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు లోయపల్లి చిన్న నర్సింగ్ రావు, కార్యదర్శి కృష్ణమూర్తి, నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కోశాధికారి రాజేశ్వర్, జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్, శశిధర్ తండ్రి శివ రాజులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**- పాపిరెడ్డి నగర్ అధ్యక్షుడు చంద్రారెడ్డి**




**కూకట్ పల్లి మార్చి 7 వెలుతురు:** విద్యార్థులు చిన్నతనం నుంచి అన్ని రంగాల్లో రాణించాలని కూకట్ పల్లి జోన్ వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. పాపిరెడ్డి నగర్ లోని రెయిన్‌బో హై స్కూల్లో శుక్రవారం జరిగిన ప్రీ–ప్రైమరీ డే, గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల కర్సస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పి.ధర్మారావు, రెయిన్‌బో హై స్కూల్ ప్రిన్సిపల్ సునీత, షాపూర్ బ్రాంచ్ ప్రతినిధి హరీష్, లక్ష్మి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లక్ష్మి తో పాటుగా విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా శానిటేషన్ మహిళా కార్మికులకు చీరల అందజేత



**కూకట్ పల్లి మార్చి 7 వెలుతురు:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ లో జిహెచ్ఎంసి మహిళా కార్మికులకు చీరలను పంపిణి చేశారు. మహిళా శ్రమ శక్తి ఫౌండేషన్ చైర్మన్ విద్య కల్పన ఏకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శాంతినగర్, సుమిత్ర నగర్, వివేకానంద నగర్, సప్తగిరి కాలనీ, విశాల్ టవర్స్ ప్రాంతాల్లో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న జిహెచ్ఎంసి మహిళా కార్మికులకు చీరలను అందజేశారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య కల్పన ఏకాంత్ గౌడ్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు మహిళా కార్మికులు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని, వారి కృషిని గుర్తిస్తూ ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా వారికి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్.ఎన్ రెడ్డి, కాలనీ పెద్దలు సతయ్య, లక్ష్మీనారాయణ, మురళీకృష్ణ, సూరారం శ్రీను, మురళీగౌడ్, మురళి, రాము, ప్రవీణ్, మహేందర్, శ్రీకాంత్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పల్నాటి అశోక్, సంపంగి యాదగిరి, బొట్టు శ్రీను, నాగమణి, షాలిని జీతేందర్, అంబికా, జ్యోతి తదితరులు హాజరయ్యారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి భక్తులందరినీ చల్లంగా చూడాలి

**- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్.**

**కుత్బుల్లాపూర్ మార్చి 07 (వెలుతురు ప్రతినిధి):** శనివారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 127 – రంగా రెడ్డి నగర్ డివిజన్ ఏపీహెచ్బి కాలనీలోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం 10వ వార్షికోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణుకా ఎల్లమ్మ తల్లి దయ భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రేమ్ కుమార్, రమణయ్య, శ్రీనివాస్ రెడ్డి, రామచందర్ రావు, జగన్, సాయిబాబా, డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, సీనియర్ నాయకులు ఓంకార్ రెడ్డి, క్రాంతి యాదవ్, ఎర్వ సాయికిరణ్ (బంటి), జల్దా లక్ష్మీనాథ్, శ్రీను, రమ్మీ గౌడ్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళా దినోత్సవం

**చౌటుప్పల్ వెలుతురు మార్చి 07:**



చౌటుప్పల్ లో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్న శిక్షణ కేంద్రం శిక్షకురాలు (మాస్టర్) రుద్ర భారతిని శాలువాతో సన్మానించారు. శిక్షణ పొందుతున్న మహిళలంతా కలిసి కేకు కోశారు. ఆటపాటలతో సందడి చేశారు.

## నార్కట్పల్లి మండలంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 07:** నార్కట్ పల్లి మండలం లో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చెరుకుపల్లి రామలింగం ఆధ్వర్యంలో భారీగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ జనసేన పార్టీ ఇంచార్జ్ చెరుకుపల్లి రామలింగం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేన పార్టీ సునామిలా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో కూడా జనసేన పార్టీకి నాయకులు, కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా జనసేన పార్టీ సత్తా చాటాలని నకిరేకల్ నియోజకవర్గ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు శివకుమార్, యూత్ వింగ్ అధ్యక్షులు గొలుసుల హరీష్ యాదవ్, అశోక్, కిరణ్, సత్యనారాయణ, చెరుకుపల్లి ఎల్లయ్య, నరేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున స్కూల్లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం.



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 07:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నాగార్జున స్కూల్లో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు సమాజానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప మహిళామణుల వేషధారణలో రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ కర్తవ్య నిర్వహణలో ముందుంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారన్నారు. విద్యార్థినిల ఉన్నతమైన చదువు సమాజాభివృద్ధికి నాంది అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ మాట్లాడుతూ ఈ మహిళా దినోత్సవం థీమ్ గివ్ టు గైన్. మహిళలకు ఇచ్చే గౌరవం, సహకారం, అవకాశాలు మనందరి వృద్ధికి దోహదం చేస్తాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రాతినిధ్యాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను శాలువతో సత్కరించారు. స్కూల్ సిబ్బంది సంధ్య స్వప్న విజయశ్రీ, లత,నరసింహ,వినిష తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

**- మరిపడిగా గ్రామ సర్పంచ్ గూడెపు కుమార్**



**గుండాల మార్చి7,(వెలుతురు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగా గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పది లక్షల రూపాయల సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ గూడెపు కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాన్ని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరియు భువనగిరి పార్లమెంట్ శాసనసభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గార్ల సహకారంతో మరిపడిగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడానికి కృషి చేస్తానని తెలియజేశారు ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ప్రభుత్వం ఎల్లవేళలా ప్రజల గురించి మహిళలను అన్ని రంగాలలో ముందంజ ఉంచడంలో ప్రజా ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. మరిపడిగా గ్రామాన్ని మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చొప్పరి సోమయ్య. వార్డు సభ్యులు ఇంద్రాల ఉపేంద్ర, పానుగంటి వెంకటమ్మ,అనంతల సోమయ్య,బండారి సుభాష్,బూడిద రోజా, తేరాల మహేందర్, పానుగంటి గణేష్, యాదండ్ల అండలు, తేరాల కిష్టయ్య,గ్రామ శాఖ అధ్యక్షులు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు

## ఇంద్రపాలనగరం గ్రామంలో రైతు అవగాహన సదస్సు కార్యక్రమం

**- మండల వ్యవసాయ అధికారి ఆజాద్ అలీ ఖాన్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 07:** రైతు వేదిక లో సమగ్రవ్య వసాయంనానో ఎరువుల వాడకం ప్రస్తుతవరి పంటలో పురుగులు మరియు తెగులు పైన రైతులకు రైతు అవగాహన సధస్సురైతు వేదిక ఇంద్రపాలనగరం క్లస్టర్ లో మండల వ్యవసాయ అధికారి అజాజ్ ఆలీఖాన్,మండల ఏ ఈ వో లు కిరణ్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన నానో ఎరువుల వాడకం గురించి జరిగిన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గర్ధాస్ విక్రమ్ సర్పంచ్ ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి ,రైతులు మందడి విధ్యాసాగర్ రెడ్డి , రాజన్నగారి రమేష్, రవ్వ నర్సింహా,జిల్లాల ధనుంజయ, గర్ధాస్ వెంకటేష్,శివగల్ల ముత్యాలు, తుమ్మల శేఖర్, బోనగిరి సంజీవ, వెలిమినేటి నరేష్, గడ్డం సాయి, కుకూట్ల సత్తయ్య, ఈర్లపల్లి రమేష్, జిట్టబోయిన వెంకటేష్, రాధారపు నర్సింహా,రాధారపు మల్లేశం, రాస సత్తయ్య,నల్ల గిరిబాబు, పగుడాల సుదర్శన్, నీరుడు వెంకటేష్, మంటి బిక్షం, భూతం బిక్షం,మేకల నరేందర్, చిందం బిక్షపతి, కుకూట్ల సుధాకర్, మండల నర్సింహా, బోనగిరి మధు, మాధం నగేష్, పోతరాజు భాస్కర్, సింగణబోయిన మల్లేశం ,తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 07:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మహిళా సాధికారత కమిటీ (ఉమెన్ ఇంప్రూవ్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా. జి. సునీత మరియు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం. అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫ్. రహత్ ఖానం అధ్యక్షత వహించారు. మహిళల సాధికారత, సమాన హక్కులు మరియు సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు విద్య, ఉద్యోగం మరియు నాయకత్వ రంగాలలో ముందుకు సాగి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి మరియు సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులను స్టాఫ్ క్లబ్ తరపున ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. పి. వెంకటేశ్వరరావు మరియు అధ్యాపకులు డా.కృష్ణ కౌండిన్య, డా.లక్ష్మీ నీలిమ, డా.వెంకటేశ్వర్లు, డా.కిషన్, డా.శ్రీనివాస్, డా.బ్రహ్మం, డా.రత్నమంజుల, నరేష్, రాధిక, రవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు నేరుగా గ్రీన్ ఛానల్ ద్వారా బ్యాంక్ అకౌంట్ ద్వారా వేతనాలు అందివ్వాలి

**- పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి.**

**- గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము.**







**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 07:** సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా సర్కులర్ ప్రతిల దగ్ధం. గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు నేరుగా ప్రభుత్వమే వారి బ్యాంకు అకౌంట్ ద్వారా అందించాలని నెలల తరబడి పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ &వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామన్నపేట మండల గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ &వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం మండల పంచాయతీ అధికారి రఫుఫ్ అలీ కి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం స్థానిక సుభాష్ సెంటర్లో ప్రభుత్వం జారీ చేసిన సర్కులర్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలుపడం జరిగింది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరం సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల జీవితాలతో ఆటలాడుతోందని నెలలు తరబడి పనిచేసిన గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు అందకపోవడంతో ఇల్లు గడవని పరిస్థితి నెలకొంది అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, మండల వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి కార్యదర్శులకు, సర్పంచ్ లకు సూచనలు చేయాలని ఆన్లైన్ చేయని కార్మికుల పేర్లను వెంటనే ఆన్లైన్ లో నమోదు చేసి జీతాలు అంది ఇవ్వాలని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఆరోగ్య భద్రత ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే మరో సమ్మె జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం, గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల భిక్షం, మేడి రామచంద్రం, మంచాల రేణుక, నల్ల సుగుణమ్మ, మంటే నాగరాజు, మంటి అంజయ్య, పుట్ట నాగరాజు, ఉక్కుర్తి లచ్చమ్మ, జయమ్మ, కొమ్ము కవిత, బల్లురు చందన, శంకరమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ ప్లాన్ నిధుల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**- డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్**






**వనపర్తి వెలుతురు మార్చి 07:** రాష్ట్రంలో దళితులు, అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ, ఆ నిధులు నిజంగా దళితులు అభివృద్ధికే ఖర్చవుతున్నాయా లేదా అన్న విషయంపై స్పష్టత లేకపోవడం ఆందోళనకరమని మారుపాక అనిల్ కుమార్ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) వనపర్తి జిల్లా రెండవ మహాసభ అజ్జపాడు భాస్కర్ అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యాలయం లో సమావేశం జరిగింది. ఈ సమావేశం కు అతిథిలు గా సీపీఐ జిల్లా విజయ రాములు, డి హెచ్ పి ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి లక్ష్మీపతి హాజరైనారు. డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు సబ్ ప్లాన్ చట్టం ప్రకారం దళితులు, ఆదివాసుల జనాభా శాతానికి అనుగుణంగా నిధులు కేటాయించి, ఆ వర్గాల విద్య, ఉపాధి, ఆరోగ్యం, గృహాలు, భూమి పంపిణీ వంటి రంగాల్లో అభివృద్ధి కోసం ఖర్చు చేయాలి. కానీ అనేక శాఖలు ఈ నిధులను ఇతర పథకాల కింద చూపించడం లేదా ఖర్చు చేయకుండా నిల్వ చేయడం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. దళితులు ఇంకా విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో సబ్ ప్లాన్ నిధులు వారికి అత్యంత అవసరమని ఆయన చెప్పారు. అయినప్పటికీ ఈ నిధుల వినియోగంలో ప్రభుత్వం పారదర్శకత పాటించకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గత సంవత్సరాల్లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద కేటాయించిన మొత్తం నిధులు, ఖర్చు చేసిన మొత్తం, మిగిలిన నిధులు మరియు అవి ఏ పథకాలపై ఖర్చు అయ్యాయన్న వివరాలతో కూడిన పూర్తి స్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.అలాగే సబ్ ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లింపులు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, దళితులు మరియు ఆదివాసుల అభివృద్ధికి ఈ నిధులు పూర్తిగా వినియోగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లేదంటే దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ అవగాహన సదస్సు.

**- ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత,**

**- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష హాజరు**





**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 07:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేట ఆధ్వర్యంలో రామన్నపేట సీనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ రామన్నపేట ఛైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ హక్కులు మరియు చట్టాల గురించి అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. ముఖ్యంగా మహిళలు మరియు బాలికల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం వంటి చట్టాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. ఈ చట్టాలు మహిళలు మరియు బాలికల భద్రతకు ఎంతో ముఖ్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. మజీద్ పాల్గొని మహిళల హక్కులు, చట్టపరమైన రక్షణ మరియు సమాజంలో మహిళల పాత్రపై మాట్లాడారు. అంతేకాకుండా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టులో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి రెండు రోజుల పాటు వివిధ క్రీడా పోటీలు నిర్వహించగా, అందులో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు మరియు కోర్టు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం వలిగొండ మండల పరిధిలోని టేకులసోమారం గ్రామంలో గల సాధన మానసిక వికలాంగుల ఆశ్రమం ను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ వారికి కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు, మౌలిక సదుపాయాల కల్పన విషయంలో పరిశీలించి, వారితో మాట్లాడారు. అక్కడ ఉండే మానసిక వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ద్వారా ఎన్నో కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని అవన్నీ వారికి అందే విధంగా చూడాలని తెలిపి, అక్కడ మధ్యాహ్న భోజనం ను పరిశీలించారు.

## అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి సాధించాలి

**- ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవింద రాయుడు.**



**మోత్కూర్, మార్చి 7( వెలుతురు న్యూస్):** మహిళలు సామాజిక,ఆర్థిక, రాజకీయ రంగాల్లో సాధికారిత సాధించాలని అప్పుడే సమాజంలో లింగ వివక్షత నిర్మూలించబడుతుందని మోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నాడు ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయినిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ , మున్సిపల్ ఎన్నికల్లో మహిళలు అధిక శాతం ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడడం మహిళా సాధికారితకు నిదర్శనమని ఈ మార్పు హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఏ.ఏ.పి.సి. ఛైర్మన్ దబ్బేటి శైలజ పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మోత్కూర్ మున్సిపాలిటీ 7 వ వార్డ్ లో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక





**మోత్కూర్, మార్చి 7,(వెలుతురు న్యూస్ ):** మోత్కూరు పురపాలక సంఘ పరిధిలోని 7వ వార్డు లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం స్వప్న, మున్సిపల్ కమిషనర్ కే. సతీష్ కుమార్, వార్డు కౌన్సిలర్ గనగాని శైలజ గార్లు పాల్గొని పట్టణ ప్రజల చేత కార్యక్రమ ప్రతిజ్ఞ చేయించి వార్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గారు మరియు వార్డు కౌన్సిలర్ గారు మాట్లాడుతూ వార్డులో పారిశుద్ధ్యముకు సంబంధించి ఏ సమస్యలు ఉన్నా సంబంధిత వార్డు కౌన్సిలర్ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే 99 రోజుల ప్రణాళికలో పూర్తి చేసే విధముగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## పాలడుగు ప్రాథమిక పాఠశాలలో ప్రజా పాలన వారోత్సవాల ప్రారంభం.

**- మహిళా దినోత్సవం సందర్భంగా పలువురికి సన్మానం.**



**మోత్కూర్, మార్చి 7,( వెలుతురు న్యూస్):** దేశ పురోభివృద్ధిలో మహిళల పాత్ర అమోఘమైనది, మహిళలందరూ విద్యావంతులై సమసమాజ స్థాపనలో భాగం కావాలని AAPC చైర్మెన్ శ్రీమతి మిడిదొడ్డి శైలజ ఉద్బోధించారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పాఠశాలలో గ్రామానికి సంబంధించి వివిధ రంగాలలో సేవలందిస్తున్న మహిళా మనులకు ఘనమైన సన్మానం చేశారు .గ్రామ విద్యా,వైద్య,పరిపాలన, సామాజిక సేవా రంగాలలో విధులను నిర్వర్తిస్తున్న 22 మంది మహిళలకు సత్కార కార్యక్రమం నిర్వహించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికల అమలులో భాగంగా స్థానిక సర్పంచ్ అంతటి భగవంతు , ఎంపీవో జనార్దన్ రెడ్డి , ఛైర్మెన్ శైలజ ,ప్రధానోపాధ్యాయులు కమలాకర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం కలిసి పాఠశాల మైదానం శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా వార్డు సభ్యులు,ఆశ వర్కర్లు,అంగన్వాడీ టీచర్లు,మహిళ సంఘాల సభ్యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలలో కరాటే బెల్టుల ప్రధానోత్సవం



**మోత్కూర్, మార్చి 7,( వెలుతురు న్యూస్):** మోత్కూరు కస్తూర్బా గాంధీ పాఠశాల ఆవరణలో కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్ట్ ను శనివారం నాడు "స్టాండర్డ్ షిటూరియో ఇంటర్నేషనల్ కరాటే డు" ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కరాటే గ్రాండ్ మాస్టర్ పీ బాలరాజు హాజరయి గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రధానోత్సవం చేశారు . వారు మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వలన మంచి క్రమశిక్షణ మంచి దేహధారుఢ్యం కలుగుతుందని అమ్మాయిల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఇలాంటి మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఇప్పించడం వలన వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేసిన వారు అవుతారని స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉన్నదని తెలిపారు .అలాగే కస్తూర్బా గాంధీ స్కూలు ఎస్.ఓ. యాదమ్మ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వలన ఆత్మ రక్షణ చేసుకోవచ్చని తెలిపారు .ఈ కార్యక్రమానికి సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. బెల్ట్ లు సాధించిన విద్యార్థులను కరాటే గ్రాండ్ మాస్టర్ బాలరాజు , సీనియర్ కరాటే మాస్టర్ అన్నెపు వెంకట్,. పి ఈ టి జ్ఞానసుందరి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి కరాటే ఇన్స్పెక్టర్ ఎన్.సాక్షి, కస్తూర్బ ఉపాధ్యాయినిల బృందం పాల్గొన్నారు

# మానవ జన్మ పరమార్థం నీవే... ఓ మగువా... !

**ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా డాక్టర్ డా. రావణవేణి ప్రభాకర్ స్వీయ రచన కవిత్వం ..**

ఆకాశం మగువ...
అవకాశం మగువ...
అన్నింటా మగువ...
అధిరోహం మగువ...

అందానికి ఆకారం మగువ...
బంధాల సాకారం మగువ...
ఆప్యాయత ఆలయం మగువ...
అవనిలో ఆనందం మగువ...

ప్రేమ మగువ...
ప్రేరణ మగువ...

సేవ మగువ...
సేద మగువ...

మాట మగువ...
మార్పు మగువ...
చేత మగువ...
చేర్పు మగువ...

కోపం మగువ...
కాంతి మగువ...
కవ్వింపు మగువ...
నవ్వింపు మగువ...

స్వాంతన మగువ...
స్వచ్ఛత మగువ...
అణకువ మగువ..
ఆర్తి మగువ...

స్ఫూర్తి మగువ...
మూర్తి మగువ...
తెగింపు మగువ...
ముగింపు మగువ...

లాలన మగువ...

పాలన మగువ...
ప్రజ్ఞ మగువ...
ఆజ్ఞ మగువ...

ప్రకృతి మగువ...
ప్రవరం మగువ...
పౌరుషం మగువ...
ప్రౌఢం మగువ...

ప్రాణం మగువ...
ప్రాశస్త్యం మగువ...
దైవం మగువ...

దౌత్యం మగువ...

ఓర్పు మగువ...
నేర్పు మగువ...
బ్రతుకు మగువ...
భవిత మగువ...

అభివృద్ధి మంత్రం మగువా...
అభ్యున్నతి సాకారం మగువా...
మధురిమ మగువ...
మధురం మగువ...
స్నేహం మగువ...
సఖ్యత మగువ...

శ్వాస మగువ...
స్వేచ్ఛ మగువ...

అలజడి మగువ...
యదసడి మగువ...

సంతోషం మగువ...
సంబరం మగువ...
ఊపిరి మగువ...
ఉప్పెన మగువ...

ఉల్లాసం మగువ...
సల్లాపం మగువ...
సందడి మగువ...
సంపద మగువ...

స్వచ్ఛత మగువ...
స్పష్టత మగువ...
మెలకువ మగువ...

అణకువ మగువ...

సృష్టిలో ఆరాధ్యం మగువా...
సృష్టికే ఆది శక్తి మగువా...
జన్మకి మూలం మగువా...
జగతికి వెలుగు మగువా...
లోకానికి లోకం మగువా...
కాలానికి కదనం మగువా...
సృష్టిని నిలిపే శక్తి మగువా...

ఆది నీవే...
అంతం నీవే...
అనంతం నీవే...
అన్నింటికీ అర్థం నీవే...
మానవ జన్మ పరమార్థం నీవే....



రచన:
డా. రావణవేణి ప్రభాకర్
ఎండి, ఆయుర్వేద వైద్య నిపుణులు, కరీంనగర్
చరవాణి:9948996253

# ఘనంగా శని దేవత మందిర ప్రతిష్టాపన మహోత్సవం....

**ఆసిఫాబాద్ వెలుతురు మార్చి 07:**





కొమరం భీం జిల్లా లోని ఆసిఫాబాద్ నేషనల్ హైవే మార్గంలో స్థానిక నివాసి సిద్ధం శెట్టి సుహాసిని సంతోష్ ల ఆధ్వర్యంలో నిర్మించిన శని దేవత ఆలయ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణలతో , వివిధ పూజా, హోమ కార్యక్రమాలతో శని దేవతా ప్రతిష్టాపన వేడుకలు కన్నుల పండుగ గా నిర్వహించారు. దేవాలయ ప్రతిష్టాపన సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తుల కోసం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఆసిఫాబాద్ సర్పంచ్ బురుస పోచం ,సబ్ ఇన్స్పెక్టర్ పోలీస్ బృందం, వివిధ ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగస్తులు, న్యాయవాదులు ,కాంగ్రెస్ నాయకులు చిన్న మల్లన్న భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ,ఆర్యవైశ్య సమాజం జిల్లా అధ్యక్షులు రాజ కొండ నాగేశ్వరరావు , చల్వేర్ సత్యనారాయణ బృందం, రాష్ట్రీయ సంఘ ఆసిఫాబాద్ ఖండ వ్యవస్థ ప్రముఖ వేణుగోపాల్ ,ఆర్ఎస్ఎస్ సంపర్కు నాగుల శ్రీనివాస్ , పలువురు హిందూ సంస్థ నాయకులు , హిందూ బంధువులు , అశేష సంఖ్యలు తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఇట్టి శనిదేవత ఆలయాన్ని నిర్మించి హిందూ బంధువులకు దారాదత్తం చేసినందుకు సిద్ధం శెట్టి సుహాసిని సంతోష్ కుటుంబ సభ్యులకు జిల్లా ఆర్యవైశ్య సమయం శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 7**




తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో చేపట్టిన 10 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక శనివారం నాడు రెండవ రోజుకు చేరుకుంది. మార్చి 6 నుండి జూన్ 12 వరకు కొనసాగే 99 రోజుల 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శనివారం కళాశాలలో పరిపాలన మరియు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. కళాశాలలోని వార్షిక మరియు పరిపాలన సంబంధిత రికార్డులను,సిబ్బంది సమన్వయంతో అప్‌డేట్ చేశారు. కళాశాలలోని అన్ని విభాగాల అధ్యాపకులు మరియు సిబ్బంది తమ తమ విభాగాల్లో శ్రమదానం నిర్వహించారు. గదుల శుభ్రత, పరికరాల అమరిక మరియు పరిసరాల పరిశుభ్రత పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యం మేరకు విద్యా సంస్థల్లో జవాబుదారీతనాన్ని, నాణ్యతను పెంచేందుకు ఈ 99 రోజుల ప్రణాళిక ఎంతో దోహదపడుతుందని, రెండవ రోజున రికార్డుల క్రమబద్ధీకరణతో పాటు ప్రతి విభాగం పరిశుభ్రంగా ఉండేలా శ్రమదానం చేపట్టినట్లు, విద్యాబోధనతో పాటు ఉత్తమ పరిపాలన అందించడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే కిష్టయ్య, డాక్టర్ పి విశ్వప్రసాద్, అంకం జయప్రకాష్, డాక్టర్ ఏ. సుధాకర్, డాక్టర్ జి శ్రీనివాసరావు, ఎన్ రాములు, మానస, శ్రీవల్లి, డాక్టర్ శారద వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సి ఆర్ వై "స్టెమ్ ఫర్ ఎవ్రీ గర్ల్" కార్యక్రమంలో

# స్ఫూర్తిదాయక బాలికలకు సత్కారం

### గ్రామీణ అణగారిన వర్గాల నుండి STEM రంగంలోకి ప్రయాణం ఎంత కష్టమంటే.




**హైదరాబాద్ వెలుతురు ప్రతినిధి మార్చి 07:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, చైల్డ్ రైట్స్ అండ్ యు CRY సంస్థ శనివారం హైదరాబాద్‌లోని బేగంపేట్ టూరిజం ప్లాజాలో "స్టెమ్ ఫర్ ఎవ్రీ గర్ల్" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్) రంగాల్లో విద్య, వృత్తులు కొనసాగిస్తున్న బాలికల ఆశయాలను, విజయాలను విశదీకరించింది. తెలుగు రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాలు, అణగారిన వర్గాల సమాజాల నుండి వచ్చిన బాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొని, సామాజిక, ఆర్థిక, సాంప్రదాయక అడ్డంకులను అధిగమిస్తూ STEM రంగాల్లో విద్యా, వృత్తులను సాధించేందుకు చేసిన తమ ప్రయాణాలను, ఆ క్రమంలో ఎదుర్కొన్న అవరోధాలను, వాటిని అధిగమించిన విధానాలను పంచుకున్నారు. CRY సౌత్ రీజనల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ స్టెమ్ ఫర్ ఎవ్రీ గర్ల్ కార్యక్రమం లక్ష్యం, నేపథ్యం గురించి, అణగారిన వర్గాల బాలికల విజయాలను గుర్తించి విజయోత్సవాలు జరుపుకోవాల్సిన అవసరాన్ని గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా వనరులు, అవకాశాలు ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమాటిక్స్ (STEM) రంగాలు కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయని అన్నారు. దళిత, ఆదివాసీ, మత్స్యకార వంటి అణగారిన వర్గాలు, పట్టణ పేద సమాజాల పిల్లలకు స్టెమ్ విద్యను అందుకునే అవకాశాలు చాలా పరిమితంగా ఉన్నాయని, అందులోనూ బాలికలు అత్యధికంగా స్టెమ్ వెలుపలే ఉండిపోతున్నారని పేర్కొన్నారు.

ఈ అసమానతలను తగ్గించేందుకు CRY సంస్థ అణగారిన వర్గాల బాలికలను దృష్టిలో పెట్టుకుని STEM లెర్నింగ్ సెంటర్లను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా గత ఐదేళ్లలో దక్షిణ భారతదేశం అంతటా 60కి పైగా STEM ల్యాబ్‌లను విస్తరించింది" అని ఆయన తెలిపారు. ఈ అణగారిన సమాజాల నుండి STEM రంగాల్లో అడుగుపెడుతున్న బాలికల విజయాలను ఉత్సవంగా జరుపుకోవడం కోసం మహిళా దినోత్సవం సందర్భంగా 'స్టెమ్ ఫర్ ఎవ్రీ గర్ల్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సైన్స్, టెక్నాలజీ కొద్ది మందికి మాత్రమే పరిమితమైన ప్రత్యేక హక్కుగా కాకుండా అందరికీ అందుబాటులో ఉండాలనే సందేశం ఈ కార్యక్రమం లక్ష్యం అని ఆయన వివరించారు. జానపద గాయని, సరిగమప ఫైనలిస్ట్ పార్వతి ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరై, తన చిన్ననాటి నుండి చదువు కొనసాగించడానికి, తన కలలను సాకారం చేసుకోవడానికి ఎదుర్కొన్న కష్టాలను పంచుకున్నారు. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో తమ ఆశయాలను సాధించాలని బాలికలకు ఆమె పిలుపునిచ్చారు. CRY సౌత్ ప్రోగ్రామ్స్ హెడ్, జనరల్ మేనేజర్ పీటర్ సునీల్ మాట్లాడుతూ.. STEM విద్యలో బాలికల భాగస్వామ్యంపై CRY తాజాగా నిర్వహించిన అధ్యయనం లోని ముఖ్యాంశాలను పంచుకున్నారు. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో అవకాశాలను పొందడంలో బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించడంతో పాటు, కుటుంబాలు, పాఠశాలలు, సమాజం నుండి నిరంతర మద్దతు అవసరమని ఆయన తెలిపారు.

**అవరోధాలను అధిగమించిన ప్రేరణాత్మక ప్రయాణాలు**

ఈ కార్యక్రమంలో బాలికలు తమ విజయగాధలను పంచుకున్నారు. STEM రంగాల్లో చదువు కొనసాగించి, ఉద్యోగాల్లోకి ప్రవేశించాలనే సంకల్పాన్ని వారు పంచుకుంటూ, తమ సమాజాల్లోని ఇతర బాలికలు కూడా స్టెమ్ ఆశలను, ఆశయాలను కొనసాగించేందుకు ప్రేరణగా నిలిచారు. తెలంగాణలోని మెద్చల్ జిల్లా జవహర్‌నగర్‌కు చెందిన గ్యాంగ్యాడ చంద్రిక (19) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీరింగ్ చదవాలన్న తన ఆశయాన్ని పంచుకున్నారు. భవిష్యత్తులో పోలీస్ విభాగంలో చేరి సమాజానికి సేవ చేయాలనేది కూడా తన కలగా చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెకు చెందిన బండారు భావాని తీవ్రమైన ఆర్థిక కష్టాలను అధిగమించి చివరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన తన ప్రయాణం గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గ్రామీణ, అట్టడుగు వర్గాల సమాజాల నుండి వచ్చిన కురపాటి లావణ్య, రాపోలు దీపిక, గుర్రంకొండ గణిత, మేకల గంగోత్రి, బి. మౌనిక, వెలగాల నందిని, వై.సలోమి, తోటి సౌమ్య వంటి బాలికలు కూడా తమ ప్రయాణాలను పంచుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అడ్డంకులు, చిన్న వయసులో వివాహ ఒత్తిళ్లు వంటి సవాళ్ల మధ్య కూడా వారు సైన్స్, టెక్నాలజీ విద్యను కొనసాగించిన అనుభవాలను వివరించారు. వారిలో చాలామంది నాణ్యమైన సైన్స్ విద్య అందుబాటులో లేకపోవడం, గణితం, భౌతిక శాస్త్రాలను అర్థం చేసుకోవడంలో ఉన్న కష్టాలు, ఉన్నత విద్య ఖర్చులు వంటి సవాళ్లను ప్రస్తావించారు. అయితే తమ పాఠశాలల్లో, స్థానికంగానూ CRY మద్దతుతో ఏర్పాటు చేసిన STEM ల్యాబ్‌లు, కంప్యూటర్ లెర్నింగ్ సెంటర్లు, జీవన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, చదువులో పురోగతికి దోహదపడ్డాయని, STEM రంగాల్లో ముందుకు సాగేలా ప్రేరణనిచ్చాయని వారు తెలిపారు.

# మహిళల భద్రతను సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు భావించాలి

## పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం..



**కూకట్ పల్లి మార్చి 07 వెలుతురు:**

ఇబ్బందుల్లో ఉన్న మహిళల కోసం ' స్టాండ్ విత్ హర్ ' అనే నినాదం తీసుకొని వారికి ప్రతి ఒక్కరు అండగా నిలబడాలని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. తెలంగాణ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న మహిళల భద్రత లక్ష్యంగా ఆమె కోసం నిలబడండి ( స్టాండ్ విత్ హర్ ) అనే విన్నూత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు కూకట్ పల్లి జేఎన్టీయూ క్యాంపస్ కి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సాంకేతికత పెరిగిన తర్వాత సోషల్ మీడియాలో మహిళలపై వేధింపులు పెరిగాయని, ఈ సందర్భంలో చట్టాల బలోపేతం, రక్షణ చర్యలతో పాటు మనల్ని మనం మనుషులుగా సంస్కరించుకుని బాధ్యతతో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళల భద్రతను సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు భావించాలని అన్నారు. ప్రతి మహిళను మన ఇంటి ఆడబిడ్డగా భావించి, గౌరవించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడంతో మన బాధ్యత తీరిపోలేదు. మహిళల ప్రాధాన్యతను గుర్తించి, బాధ్యతలను అప్పగించడంలో ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది. ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే అందిస్తున్నమని, రేషన్ కార్డుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు మహిళల పేరుతో అందిస్తున్నాం అన్నారు. సోలార్ విద్యుత్ నుంచి ఆర్టీసీ అద్దె బస్సుల వరకు మహిళలను వ్యాపారవేత్తలుగా ప్రోత్సహిస్తున్నాం అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్య సాధనలో మహిళల ముందడుగే కీలకం. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించడంతోనే తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుంది. మహిళలకు సంపూర్ణ భద్రత కల్పించడంతోనే ఇవన్నీ నెరవేరుతాయి అన్నారు.

# నిజాంపేట్ సర్కిల్ ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర దోమల సమస్యపై కార్యాలయం ముట్టడించ్చిన బిజెపి నాయకులు.

**కుత్బుల్లాపూర్ మార్చి 07 (వెలుతురు ప్రతినిధి):**

నిజాంపేట్ సర్కిల్ ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర దోమల సమస్యపై బిజెపి పార్టీ నిజాంపేట్ సర్కిల్ నాయకులు 58 సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడించారు. పెద్ద ఎత్తున స్లొగన్స్ ఇస్తూ కమిషనర్ డౌన్ డౌన్ కాంగ్రెస్ డౌన్ డౌన్, ఎమ్మెల్యే అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కమీషనర్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు.కాలనీలో మహిళలతో పాటు ప్రజలందరితో పాటు తీసుకెళ్లి సమస్యలని నేరుగా కమీషనర్ కి వివరించి వివిధ శాఖలను సమన్వయం చేసి దోమల సమస్యను వెంటనే పరిష్కారం చేసే వరకు ధర్నా విరమించమని స్లోగన్లు చేస్తూ నిరసన తెలుపుతూ మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు.



ఈసమస్య పై తక్షణమే రివ్యూ నిర్వహించి సంబంధిత అధికారులను పిలిచి వెంటనే ఫాగింగ్ మరియు దోమల నివారణ చర్యలలో చేపడతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో బిజెపి నాయకులు ధర్నా విరమించారు.ఈకార్యక్రమంలో మూడు డివిజన్ల అధ్యక్షులు ప్రసాద్ రాజు, నరేంద్ర చౌదరి, బిక్షపతి యాదవ్, దళిత మోర్చా రాష్ట్ర నాయకులు దాసి నాగరాజు, కాసాని సంతోష్, గజ్జల్లి సంతోష్, సంతోష్ గౌడ్, ప్రహ్లాద్, కార్తీక్ అతీష్ బాబు బీజేవైఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

# నాదర్గుల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బహుమతులు

**- నెమలి అనిత జ్ఞాపకార్థం ఆమె కుమారుల వితరణ**

**ఎల్బీనగర్, వెలుతురు మార్చి 07:**



నాదర్ గుల్ గ్రామానికి చెందిన నెమలి అనిత జ్ఞాపకార్థం పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు బహుమతి ఇచ్చారు కుమారులు నెమలి మధు యాదవ్. ఈ సందర్భంగా నెమలి మధు మాట్లాడుతూ... ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పదో తరగతి విద్యార్థులకు మా అమ్మ జ్ఞాపకార్థం పెన్నులు, ప్యాడ్లు ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్ నూ అమ్మ పేరు మీద సహాయ, సహకారాలు అందిస్తామని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాదర్ గుల్ యువకులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత

**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 07:**




నార్కట్‌పల్లి శబరి గార్డెన్స్‌లో పెద్ధింటి అనిల్ రెడ్డి కుమార్తె జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ వేడుకలో నార్కట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య గౌడ్, నార్కట్‌పల్లి సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్, ఉపసర్పంచ్ శిరీషా ప్రవీణ్ రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు సట్టు సత్తయ్య, సీనియర్ నాయకులు మట్టపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు అండగా మన అందరి పెద్దన్న... రేవంతన్న!



**ఉప్పల స్వప్న**
**ఐవీఎఫ్ ప్రథమ మహిళ**

*యావత్ ప్రపంచంలో ఉక్కు మహిళగా గుర్తింపు పొందిన ఇందిరా గాంధీ వారసత్వాన్ని తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు కొనసాగిస్తున్నది. అందుచేతనే రాష్ట్రంలోని మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్ళేందుకు ముందడుగు వేస్తున్నది ప్రజా ప్రభుత్వం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నది మన ప్రభుత్వం. మహిళలను ప్రోత్సహించడంలో భాగంగా సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించిన ఏకైన ప్రభుత్వం దేశంలోనే మన తెలంగాణ. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాదు. ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేసింది ప్రభుత్వం. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించింది. దాంతో తెలంగాణ మహిళలు ప్రపంచంతో పోటీ పడుతున్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తరచూ ఉద్ఘాటించడం ఈ ప్రాంత మహిళలు చేసుకున్న అదృష్టం.*

గత ప్రభుత్వం ఆడబిడ్డలను పట్టించుకోలేదని విమర్శలు గణనీయంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఐదేళ్ల వరకు మంత్రివర్గంలో మహిళలు లేదు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం. దాంతోపాటు, త్వరలోనే చట్టసభల్లో కూడా మహిళలకు 33శాతం రిజర్వేషన్ రాబోతుందని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు పలు సందర్భాల్లో ఏ మార్పు కావాలని ఆడబిడ్డలు ఆశీర్వదించారో ఆ మార్పు ఇప్పుడు పరేడ్ గ్రౌండ్‌లో కనిపిస్తోంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తేనే రాష్ట్రం వన్ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ అవుతుందని ప్రభుత్వం పదేపదే చెబుతున్నది. వాటిని ఆచరణలో పెడుతూ ముందుకు వెళుతున్నది. ఆడబిడ్డలు తలచుకుంటే వన్ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ సాధన పెద్ద కష్టమేమీ కాదు. ఎందుకంటే, ఈ రాష్ట్రంలో 65 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. పాఠశాలల నిర్వహణ, బడి పిల్లలకు కోటి 30 లక్షల జతల యూనిఫాం కుట్టించే పని మహిళలకే అప్పగించారు. ఈ ప్రభుత్వంలో మంత్రులుగా సీతక్క, కొండా సురేఖ పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో కేబినెట్‌లో ఒక్క మహిళకు కూడా మంత్రిగా లేరు. ఇచ్చిన మాటకు కట్టుబడుండే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని అమలుచేసి వారికి ఆర్థికంగా లబ్ధి చేకూర్చింది. ఉచిత ప్రయాణంలో సగటున రోజుకు 30 లక్షల మంది మహిళా ప్రయాణికులు ప్రయోజనం పొందుతుండడంతో వారికి రూ.1,500 కోట్ల ఆదా అవుతోంది. ఉచిత బస్సు పథకానికి ప్రభుత్వం ఆర్టీసీకి నెలకు రూ.455 కోట్లు చెల్లిస్తూ ఆర్థిక భారాన్ని భరిస్తోంది. గతంలో నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీకి ఉచిత బస్సు ప్రయాణంతో ఆక్యుపెన్సీ పెరిగి లాభాల బాట పట్టింది. ఆర్థికంగా ఎన్ని సమస్యలు ఎదురైనా కుటుంబ భారం మోస్తూ కుటుంబ గౌరవాన్ని కాపాడే మహిళల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా సబ్సిడీ గ్యాస్, ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ ఇన్సూరెన్స్ పెంపు పథకాలను కూడా అమలు చేసి చేదోడుగా నిలిచి మహిళల ఆత్మగౌరవాన్ని పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ పై అందిస్తున్న రూ.500 సబ్సిడీతో సుమారు 40 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తో 50 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోంది. దాంతోపాటు, పేదల్లో భరోసా నింపేలా ఆరోగ్యశ్రీ పథకం



కింద ఇన్సూరెన్స్ ను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. మరోవైపు తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని పెంచేలా ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గం పరిధిలో 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరున అందజేసే ప్రక్రియ ప్రారంభించింది. అంతేకాక మహిళల పేరుమీదనే 40 లక్షలకుపైగా నూతన రేషన్ కార్డులను కూడా జారీ చేస్తుంది. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న కాంగ్రెస్ తమ బాధ్యత తీరిపోయింది అనేలా కాకుండా మహిళల సమగ్రాభివృద్ధికి మరిన్ని పథకాలను ప్రారంభించింది. భారత దేశ ఉక్కు మహిళ ఇందిరాగాంధీ పేరిట ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా బలోపేతం చేస్తోంది. కోటిమంది తెలంగాణ మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్రంలోని స్వశక్తి మహిళా సంఘాలను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే 63.86 లక్షల మంది మహిళలు మహిళా సంఘాల్లో సభ్యత్వం తీసుకోవడం వారికి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం. రాష్ట్రంలో ఇంటింటికీ తిరిగి ప్రతి మహిళకు సంఘాల్లో సభ్యత్వం కల్పించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. మహిళా సంఘాలకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఏటా 5,000 గ్రామ సంఘాలకు రూ.5,000 కోట్లు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మహిళా సంఘంలో చేరిన ప్రతి మహిళకు రూ.15.50 లక్షల ఆర్థిక సాయం అందజేయనుంది. వీరందరికీ ప్రభుత్వం రూ.5 లక్షల బీమా కల్పించనుంది. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం కోసం ఇప్పటికే అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం ఒక్కో భవన నిర్మాణానికి రూ. 5 కోట్ల చొప్పున మొత్తం 22 భవనాల కోసం రూ.110 కోట్లు మంజూరు చేసింది. సిరిసిల్లలో 60 ఎకరాల్లో అపెరల్ పార్కులో రెడీమెడ్ వస్త్రాల తయారీలో ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యతనిస్తోంది. నారాయణపేటలో పూర్తిగా మహిళలే నిర్వహించేలా పెట్రోల్ బంకులు ప్రారంభించిన ప్రభుత్వం ఇకపై అన్ని జిల్లాల్లో కూడా వీటిని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తుంది. మహిళలచే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇందిరా శక్తి క్యాంటీన్లను ప్రారంభించింది. కుట్టు శిక్షణతో సహా మరో 15 వ్యాపారాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం పాఠశాలల్లో యూనిఫాం కుట్టే పనులను కూడా మహిళలకే అప్పచెప్పింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో 32 జిల్లాల్లో 64 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇక కోఠిలోని మహిళా యూనివర్సిటీకి పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టి ఆమెను ప్రజా ప్రభుత్వం గౌరవించుకున్నది. సామాజికవేత్త సావిత్రీబాయి పూలే పుట్టిన రోజును మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇద్దరు మహిళలకు మంత్రి పదవులిచ్చి గౌరవించుకుంది. వడ్డీ లేని రుణాలకు సంబంధించి చెక్కులను ఇవ్వడంతో పాటు, ఏడాది కాలంలో ప్రమాదవశాత్తు మరణించిన మహిళల కుటుంబాలకు రూ.40 కోట్ల బీమా అందజేసి ప్రభుత్వం ఆదుకోనుంది. 14 వేల అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగాల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసి మహిళలకు ఉపాధి కల్పనపై దృష్టి సారించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్ష తెలిసిన సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది. మహిళా సాధికారితకు అభయహస్తం అందిస్తున్న రేవంతన్నకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# జహీరాబాద్‌లో PRTU ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**- మహిళా టీచర్లకు శాలువాలు, మెమెంటోలతో ఘన సన్మానం...**
**- సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అమోఘమని నేతల అభిప్రాయం...**





**జహీరాబాద్ వెలుతురు మార్చి 7:** సమాజ అభివృద్ధి, కుటుంబ నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పిఆర్టీయు టీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో పిఆర్టీయు టీఎస్ జహీరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా తమ ప్రతిభ, శ్రమ, సహనం ద్వారా సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకుంటున్నారని తెలిపారు. సమాజ నిర్మాణంలో మహిళల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలపై స్పందిస్తూ త్వరలో ఉపాధ్యాయులకు నూతన హెల్త్ కార్డులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధి విస్తరణ నేపథ్యంలో ఈ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 13 శాతం హెచ్ఆర్ఏ పెంపును సాధించడంలో పిఆర్టీయు సంఘం కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిఆర్టీయు టీఎస్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభు, జిల్లా గౌరవ అధ్యక్షులు డా. తులసిరామ్ రాథోడ్, జహీరాబాద్ ఎంఈఓ మాణయ్య, మొగుడంపల్లి ఎంఈఓ జాఫర్ అలీ, పిఆర్టీయు టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభు మరియు జిల్లా గౌరవ అధ్యక్షులు డా. తులసిరామ్ రాథోడ్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అమ్మగా, అక్కగా, చెల్లిగా, భార్యగా మాత్రమే కాకుండా విద్య, వైద్యం, రాజకీయాలు, వ్యాపారం వంటి అనేక రంగాలలో తమ ప్రతిభను చాటుకుంటూ దేశ అభివృద్ధికి ముఖ్య భూమిక పోషిస్తున్నారని అన్నారు. మహిళలకు ప్రభుత్వం సమాన హక్కులు, అవకాశాలు కల్పించి మరింత ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా సమావేశానికి విచ్చేసిన సుమారు 80 మంది మహిళా టీచర్లను పిఆర్టీయు నాయకులు శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గజిటెడ్ హెచ్ఎం లు ప్రియదర్శిని, హెచ్. రేణుకాదేవి, అనిత, సుగుణ, సూచిరత, ఉమారాణి, ఎం. చంద్రకళ, వెంకటేశం, మల్లన్న తదితరులు పాల్గొని ప్రసంగించారు. అదేవిధంగా పిఆర్టీయు టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి. శ్రీనివాస్, సురేందర్, ప్రదీప్ కుమార్, బాలయ్య, శివరాజ్, రమేశ్ బానోత్, అమర్నాథ్ రెడ్డి, అనిల్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. ఆనంద్, సతీష్ పాల్గొన్నారు. ఇంకా పిఆర్టీయు టీఎస్ జహీరాబాద్ అర్బన్ అధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి తుకారామ్ చవ్వాణ్, జహీరాబాద్ రూరల్ అధ్యక్షులు బాగయ్య, ప్రధాన కార్యదర్శి అశోక్, మొగుడంపల్లి అధ్యక్షులు అర్జున్ చవ్వాణ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, కోహీర్ అధ్యక్షులు తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ నాథ్, ఝరాసంగం అధ్యక్షులు రమాకాంత్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, న్యాల్కల్ ప్రధాన కార్యదర్శి పాండయ్యతో పాటు పిఆర్టీయు నాయకులు కేవీఎస్ఎస్ ప్రసాద్, నర్సింహా రెడ్డి, రత్నయ్య, రాజ్ కుమార్, ఎండీ హుస్సేన్, మోహన్, శేఖయ్య, గోవర్ధన్, దేవి సింగ్ రాథోడ్, బాబు, బి. వెంకటేశం, శంకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సివిల్స్‌లో ఓబిసి అధ్యర్థులకు ర్యాంకులు

**- అభినందించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్**

**హైదరాబాద్,మార్చి7( వెలుతురు):** ఇటీవల విడుదలైన సివిల్ పరిక్షా ఫలితాల్లో తెలంగాణకు చెందిన 20 మంది అభ్యర్థులకు మంచి మార్కులు రావటం, అందులో 10 మంది అభ్యర్థులు ఓబీసీ వర్గానికి చెందినవారు కావడం ఎంతో సంతోషదాయకమని తెలంగాణ బీసీ కమిషన్ అభివర్ణించింది. బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తెలంగాణ నుండి మంచి ర్యాంకులు సాధించిన 20 మంది అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ నుండి మంచి ర్యాంకులు వచ్చిన 20 మందిలో 10 మంది బీసీ వర్గాలకు చెందిన వారు కావడం బీసీల్లో విద్యాపరంగా కలుగుతున్న చైతన్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు.

# జహీరాబాద్ కోర్టులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**- మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**
**- న్యాయమూర్తుల సూచన...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 07:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఖలీల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి సంయుక్తంగా నిర్వహించి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన భారతీయ సంప్రదాయం అని పేర్కొన్నారు. మహిళలు విద్య, ఉద్యోగం, రాజకీయాలు సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం కూడా మహిళలకు పలు రంగాల్లో అవకాశాలు కల్పిస్తోందని,



వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కోర్టులో పనిచేస్తున్న మహిళా సిబ్బందితో పాటు మహిళా న్యాయమూర్తులను శాలువాలతో సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు మరియు పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై సిపిఐ పోరాటం.

**- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం.**
**- సిపిఐ నిరసన దీక్ష.**
**- సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్.**



**కుత్బుల్లాపూర్ మార్చి 07 (వెలుతురు ప్రతినిధి):** జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పై పోరాటం అనే నినాదంతో ప్రగతి నగర్ సర్కిల్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించడం జరిగింది. ఈ నిరసన దీక్షను పాలభిందెల శ్రీనివాస్, పొన్నకంటి దస్తగిరి తో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు చేయించగా ముఖ్యఅధితిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రజా సమస్యల పై సిపిఐ పోరాటం అనే నినాదంతో నిరసన దీక్ష నిర్వహించము అని తెలిపారు. నిజాంపేట్ సర్కిల్లో అంబీర్ చెరువు, తూర్క చెరువు, బైన్ చెరువు, పాపయ్య కుంట, కొత్త కుంట మొదలైన వాటిలో గుర్రపు డెక్కలు పెరగడం వల్ల వాటిని ఆసరా చేసుకొని దోమలు విపరీతంగా ప్రజల పై దాడి చేస్తున్నాయి అని గుర్తు చేశారు. కనుక ముందు గుర్రపు డెక్కలను తొలగించి తరువాత దోమలను నివారించాలి అని అన్నారు. అలాగే నిజాంపేట్ సర్కిల్ పరిధిలో రోడ్లు , డ్రైనేజ్ పెండింగ్ పనులు పూర్తి చేయకపోవడం చాలా బాధాకరం అని దాని వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతుంది అని అన్నారు. కనుక వెంటనే రోడ్లు, డ్రైనేజ్ పనులు పూర్తి చేయాలి అని అన్నారు. బస్తీ దావఖానాలలో డాక్టర్లు, నర్సుల కొరత వల్ల నిరూపయోగముగా వున్నాయి అని వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలనీ వారు డిమాండ్ చేశారు. ఎండ కాలం వచ్చింది కనుక ప్రజలకు మంచి నీటి కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తొంబై శాతం అక్షరాస్యత గల నిజాంపేట్ సర్కిల్లో గ్రంధాలయం లేకపోవడం చాలా బాధాకరం అని అన్నారు.గ్రామపంచాయితీగా ఉన్న నాటి నుండి ప్రతి సంవత్సరం ఇంటి పన్నులో గ్రంధాలయనికి పన్ను కట్టుకునే ప్రభుత్వాలు, అధికారులు ముక్కు పిండి పన్ను వసూలు చేశారు తప్ప గ్రంధాలయం కట్టాలని ఆలోచించలేదు అని గుర్తు చేశారు. కనుక వెంటనే గ్రంధాలయం ఏర్పాటు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అలాగే జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయాలనీ, బాచుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయనికి నలుగురు ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి వెళ్తే కనీసం కూర్చోడానికి స్థలం లేక పాత బాచుపల్లి గ్రామపంచాయితీ కార్యాలయని వాడుతున్నారు. కాబట్టి వెంటనే తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అలాగే నిజాంపేట్ సర్కిల్లో పని చేసే మున్సిపల్ కార్మికుల, చెత్త బండి నడిపే కార్మికుల, చిరు వ్యాపారుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలనీ వారు డిమాండ్ చేశారు. వెంటనే పై సమస్యలు పరిష్కారం చేయకపోతే నిజాంపేట్ సర్కిల్,రెవెన్యూ కార్యాలయాలు ముట్టడి చేస్తాము అని హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత మేకల. నాగేష్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ.కృష్ణ, ఆశి. యాదయ్య, బ్రహ్మానందం, కేశవులు, ప్రకాష్ ,నాగేష్, శివ, కృష్ణ, గంగన్న, పి. సింధూరి, పి. కవిత తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసిన సీఐ

**కుత్బుల్లాపూర్ మార్చి 07 (వెలుతురు ప్రతినిధి):**



శనివారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నందు గతంలో సెల్ ఫోన్స్ పోగొట్టుకున్న 50 మంది సెల్ ఫోన్ లను CEIR పోర్టల్ ద్వారా గుర్తించి వారికి వారి యొక్క సెల్ ఫోను అప్పగించారు.వివిధ రూపాల్లో పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసి బాధితులకు జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ అందజేశారు. ఈసందర్భంగా సెల్ ఫోన్ పోగొట్టుకొని తిరిగి పొందిన వారు ఆనందం వ్యక్తం చేశారు. ఎవరైనా సెల్ఫోన్ పోగొట్టుకున్నట్లయితే దానిని ఎవరు ఎఅంబంవ చేయకుండా, అట్టి సెల్ ఫోన్ తో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండుటకు మీ సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగలరు. ఇట్టి ఫిర్యాదులను CEIR పోర్టల్ నందు నమోదు చేసి మీ యొక్క సెల్ ఫోను గుర్తించి మరలా వాటిని మీకు తిరిగి ఇచ్చే ప్రయత్నం పోలీస్ చేయగలరని ఆయన తెలిపారు.

# మోడల్ గ్రేవ్ యార్డ్ గా కళావతి నగర్ స్మశాన వాటికను అభివృద్ధి పరుస్తాం

**- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్.**



**కుత్బుల్లాపూర్ మార్చి 07 (వెలుతురు ప్రతినిధి):** శనివారం 129 – సూరారం డివిజన్ కళావతి నగర్ హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళావతి నగర్ హిందూ స్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు ఎన్ని నిధులైన కేటాయించి మోడల్ గ్రేవ్ యార్డ్ గా తీర్చిదిద్దుతామన్నారు. మనిషి జీవితంలోని చివరి మజిలీని గౌరవప్రదంగా నిర్వహించేందుకు స్మశాన వాటికలో చేపట్టవలసిన మౌలిక వసతులను అన్నింటిని కల్పించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఈ అనురాగ్, మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, స్థానిక సంక్షేమ సంఘం నాయకులు రజితారత్నం, సదానందం గౌడ్, హరినాథ్, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కోలా శ్రీకాంత్ ముదిరాజ్, గుబ్బల లక్ష్మీనారాయణ, కెపి.వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ కార్యాలయ సిబ్బందిని నియమించండి.....!

**- ఎంపీ సురేష్ శెట్కార్ ను కోరిన కోహిర్ మున్సిపల్ చైర్మన్ అశోక్**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 07:** సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కార్యాలయంలో పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడంతో వెంటనే నియామకాలు చేపట్టాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ ను కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో పరిపాలన, అభివృద్ధి పనులు సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా అసిస్టెంట్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్, మేనేజర్, ఆర్.ఓ., రెవెన్యూ ఇన్స్పెక్టర్, పట్టణ ప్రణాళిక అధికారి వంటి కీలక పోస్టులతో పాటు బిల్ కలెక్టర్లు (5), క్యాషియర్ (1), అసిస్టెంట్ బిల్ కలెక్టర్లు (5), వర్క్ ఇన్స్పెక్టర్లు (4), వర్క్ సూపర్వైజర్ (1), శానిటేషన్ ఇన్స్పెక్టర్ (1), పారిశుధ్య జవాన్లు (4), జూనియర్ అసిస్టెంట్లు (4), కంప్యూటర్ ఆపరేటర్లు (4), విద్యుత్ సిబ్బంది (4), ఇన్‌వార్డ్‌ఔట్‌వార్డ్ సిబ్బంది (2) తదితర పోస్టులను భర్తీ చేయాలని ఎంపీకి తెలియజేశారు. వినతిని పరిశీలించిన ఎంపీ సురేష్ శెట్కార్ సానుకూలంగా స్పందిస్తూ కోహిర్ మున్సిపాలిటీ కార్యాలయంలో అవసరమైన సిబ్బందిని త్వరలో నియమించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ తెలిపారు. కోహిర్ మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది నియామకం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు.

# ఊరు ఖాళీ అవుతోంది.. ఉపాధి వెతుకులాటలో పల్లె యువత!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

*దేశానికి వెన్నెముక రైతు అని మనం గర్వంగా చెప్పుకుంటాం. భారతదేశం ప్రాథమికంగా ఒక వ్యవసాయ ప్రధాన దేశం. మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు అన్నీ ఈ మట్టితోనూ, పంటతోనూ ముడిపడి ఉన్నాయి. గణాంకాల ప్రకారం, ఇప్పటికీ మన దేశ జనాభాలో దాదాపు 65 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. అయితే, ఒకప్పుడు కళకళలాడిన పల్లెలు నేడు వెలవెలబోతున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా పల్లెల నుంచి పట్టణాలకు సాగుతున్న వలసల జోరు దేశ సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్ని వేగంగా మార్చేస్తోంది. ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడి బతికే యువత, తమ పూర్వీకుల వృత్తిని వదిలి నగర బాట పట్టడం ఒక గంభీరమైన హెచ్చరికగా మారింది.*

గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వలస వెళ్లడం వెనుక కేవలం నగరాల మీద ఉన్న వ్యామోహం మాత్రమే లేదు,దాని వెనుక అంతులేని ఆర్థిక వేదన, వ్యవస్థాగత లోపాలు ఉన్నాయి. ఒకప్పుడు గౌరవప్రదమైన వృత్తిగా ఉన్న వ్యవసాయం, నేడు అత్యంత నష్టదాయకమైన వ్యాపారంగా మారిపోయింది. పెట్టుబడి ఖర్చులు ఆకాశాన్ని అంటుతుంటే, పండిన పంటకు గిట్టుబాటు ధర దక్కడం గగనమవుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నాయి. కానీ, రైతు పండించిన ధాన్యానికి మాత్రం ధర నిర్ణయించే అధికారం రైతుకు లేదు. మధ్యవర్తుల వ్యవస్థ దళారీల జేబులు నింపుతుంటే, చెమటోడ్చిన రైతుకు మాత్రం కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. ఈ ఆర్థిక అస్థిరత రైతును నిరాశలో ముంచెత్తుతోంది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పుల ప్రభావం నేరుగా మన పొలాల మీద పడుతోంది. అకాల వర్షాలు, తీవ్రమైన కరువు కాటకాలు, వరదలు రైతుల ఆశలను అడియాసలు చేస్తున్నాయి. భూగర్భ జలమట్టం పడిపోవడం వల్ల బోర్లు ఎండిపోతున్నాయి. సరైన నీటి పారుదల సౌకర్యాలు లేని గ్రామాల్లో వ్యవసాయం చేయడం అంటే ఒక జూదంలా మారిపోయింది. ప్రకృతి కన్నెర్ర చేసిన ప్రతిసారీ ఒక రైతు కుటుంబం ఊరు విడిచి వెళ్లాలని నిర్ణయించుకుంటోంది. వ్యవసాయం కోసం చేసే అప్పులు రైతు మెడకు ఉరితాళ్లుగా మారుతున్నాయి. బ్యాంకుల నుంచి రుణాలు పొందడం ఒక ప్రహసనమైతే, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు చేయడం మరొక శాపం. పంట పండకపోయినా, ధర రాకపోయినా అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ భయంకరమైన పరిస్థితులను చూస్తున్న యువత, మాకొద్దు ఈ వ్యవసాయం అంటూ నగరాల్లో చిన్నపాటి ఉద్యోగాలకైనా సిద్ధపడుతున్నారు. గ్రామాల్లో నాణ్యమైన విద్య, వైద్యం అందకపోవడం వలసలకు ప్రధాన కారణం. తమ పిల్లలు కూడా తమలాగే కష్టపడకూడదని, వారు గొప్ప చదువులు చదవాలని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. కానీ గ్రామాల్లో సరైన పాఠశాలలు, కళాశాలలు లేవు. అలాగే, అత్యవసర వైద్యం కావాలంటే మైళ్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. మెరుగైన జీవన ప్రమాణాల కోసం కుటుంబాలన్నీ పట్టణాల వైపు తరలి వెళు_న్నాయి. నగరాలు ఒక మాయా ప్రపంచంలా కనిపిస్తాయి. అక్కడ ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయనే నమ్మకం గ్రామీణ యువతను ఆకర్షిస్తోంది. వ్యవసాయంలో ఆదాయం ఎప్పుడు వస్తుందో తెలియదు. కానీ నగరంలో కూలీ పనైనా, సెక్యూరిటీ గార్డు ఉద్యోగమైనా నెలాఖరుకు చేతికి కొంత డబ్బు అందుతుంది. ఈ ఆర్థిక భరోసా యువతను ఆకట్టుకుంటోంది.24 గంటల విద్యుత్, ఇంటర్నెట్, రవాణా సౌకర్యాలు, వినోదం కోసం సినిమా హాళ్లు, షాపింగ్ మాల్స్ వంటివి ఆధునిక జీవనశైలిని ఇష్టపడే యువతను ఆకర్షిస్తున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులు, స్పెషలిస్ట్ డాక్టర్లు, పేరున్న విద్యాసంస్థలు నగరాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. ఇది సామాన్యుడికి ఒక రకమైన సామాజిక భద్రతను ఇస్తుంది. వలసల వల్ల కలుగుతున్న దుష్ప్రభావాలువలసలు కేవలం వ్యక్తుల మార్పు మాత్రమే కాదు, ఇది ఒక దేశ ఆర్థిక మూలాలను కదిలించే ప్రక్రియ. యువత వలస వెళ్లడం వల్ల గ్రామాల్లో కేవలం వృద్ధులు, మహిళలు మాత్రమే మిగిలిపోతున్నారు. దీనివల్ల సాగుకు అవసరమైన శ్రమశక్తి కొరవడుతోంది. సాగు భూములు బీడులుగా మారుతున్నాయి. ఇది దీర్ఘకాలంలో దేశ ఆహార భద్రతకు (Food Security) ముప్పుగా పరిణమిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తి తగ్గితే ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని అంటుతాయి. దీని ప్రభావం మళ్లీ సామాన్యుడిపైనే పడుతుంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతోంది. ఊళ్లలో ఉండే ముసలి తల్లిదండ్రులకు ఆపద వస్తే చూసేవారు లేని పరిస్థితి నెలకొంది. పండగలు, పబ్బాలు, సామాజిక కట్టుబాట్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పల్లెటూరి ఆత్మీయత స్థానంలో నగరపు యాంత్రికత చోటు చేసుకుంటోంది. మరోవైపు నగరాలు జనాభా భారంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. మురికివాడల (Slums) సంఖ్య పెరుగుతోంది. ట్రాఫిక్ సమస్యలు, కాలుష్యం, నీటి ఎద్దడి వంటివి నగర జీవితాన్ని దుర్భరం చేస్తున్నాయి. వలస వచ్చిన వారు నగరాల్లో తక్కువ వేతనాలకు, అపరిశుభ్రమైన వాతావరణంలో బతకాల్సి వస్తోంది. వీరికి ఎటువంటి సామాజిక రక్షణ ఉండదు. ఈ వలసల ప్రవాహాన్ని అడ్డుకోవాలంటే కేవలం మాటలు సరిపోవు, చేతల్లో మార్పు రావాలి. ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర (MSP) కల్పించడంలో చిత్తశుద్ధి చూపాలి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తూ, పెట్టుబడికి అదనంగా 50 శాతం లాభం వచ్చేలా చూడాలి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు తమ పంటను నేరుగా అమ్ముకునేలా ఈ-నామ్ వంటి వేదికలను బలోపేతం చేయాలి.సాంప్రదాయ వ్యవసాయానికి ఆధునిక సాంకేతికతను జోడించాలి. డ్రోన్ల వినియోగం, సాయిల్ టెస్టింగ్, డ్రిప్ ఇరిగేషన్ వంటి పద్ధతులపై రైతులకు శిక్షణ ఇవ్వాలి. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలను ప్రోత్సహించాలి.పల్లెల్లోనే ఉపాధి దొరికితే ఎవరూ వలస వెళ్లరు. గ్రామాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు (Agro`based industries) నెలకొల్పాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. హస్తకళలు, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చు. పట్టణ సౌకర్యాలు పల్లె జీవనం అనే నినాదంతో గ్రామాల్లో అభివృద్ధి జరగాలి. నాణ్యమైన విద్యుత్, స్వచ్ఛమైన తాగునీరు, ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను నిర్మించాలి. గ్రామీణ రోడ్ల అనుసంధానం వ్యాపారానికి ఊపిరి పోస్తుంది. వ్యవసాయం అంటే కేవలం బురదలో దిగడం మాత్రమే కాదు, అది ఒక గౌరవప్రదమైన స్టార్టప్ అనే భావన యువతలో కలగాలి. అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్లు గ్రామాలకు వెళ్లి రైతులకు సలహాలు ఇచ్చేలా ప్రోత్సాహకాలు అందించాలి. సేంద్రీయ వ్యవసాయం (Organic Farming) పట్ల అవగాహన కల్పించి, దానికి అంతర్జాతీయ మార్కెట్ కల్పించాలి.వలసలు అనేవి అభివృద్ధిలో భాగమే కావొచ్చు కానీ, అది పల్లెలను శ్మశానాలుగా మార్చేలా ఉండకూడదు. భారతదేశం మెరుగైన భవిష్యత్తు వైపు పయనించాలంటే పల్లెలు పచ్చగా ఉండాలి, రైతు కళ్లలో ఆనందం ఉండాలి. నగరాలు ఎంత ఎత్తుకు ఎదిగినా, ఆ ఎత్తుకు పునాది మాత్రం పల్లెటూరే. ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాల మీద కాకుండా, క్షేత్రస్థాయిలో రైతు చేతికి అందాలి. సమాజంగా మనం కూడా రైతును, వ్యవసాయాన్ని గౌరవించడం నేర్చుకోవాలి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సంపాదనకు ఉన్న విలువ, అన్నం పెట్టే రైతు కష్టానికి కూడా ఉన్నప్పుడే ఈ వలసల ధోరణి మారుతుంది. పల్లెలు స్వయంసమృద్ధి సాధించినప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుంది. మన యువత మళ్లీ నాగలి పట్టి, మట్టిలో బంగారం పండించే రోజు రావాలని ఆశిద్దాం. ఎందుకంటే, రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది.

# శాంతి భద్రతల్లోనే కాదు.. క్రీడల్లోనూ మగువలే మేటి

## - క్రీడారంగంలో సత్తా చాటుతున్న మహిళా పోలీసులు

**హైదరాబాద్,మార్చి7( వెలుతురు):** విధి నిర్వహణలో కఠినంగా ఉంటూనే, మరోవైపు క్రీడా మైదానంలో పతకాల పంట పండిస్తున్నారు సైబరాబాద్ మహిళా పోలీసులు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూనే, యోగా, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ వంటి విభాగాల్లో జాతీయ స్థాయి ప్రతిభను కనబరుస్తూ తోటి సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి విజయగాథలపై ప్రత్యేక కథనం.రాజమణి కేవలం పోలీస్ విధులకు మాత్రమే పరిమితం కాకుండా, వివిధ క్రీడల్లో తనదైన ముద్ర వేశారు. స్విమ్మింగ్ 50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. ట్రెడిషనల్ యోగాసన (18-28 ఏళ్ల విభాగం)లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు.5000 మీటర్లు, 10000 మీటర్ల ట్రాక్ ఈవెంట్లలో రెండు వెండి పతకాలు సాధించి తన వేగాన్ని నిరూపించుకున్నారు. ఆర్.ఎస్.ఐ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రోహిణి, బ్యాడ్ మిన్ టన్ క్రీడల్లో తిరుగులేని ప్రతిభను చాటుతున్నారు.ఎన్.జి.ఓ ఓపెన్ విభాగంలో బంగారు పతకం సాధించారు. టేబుల్ టెన్నిస్ ఓపెన్ డబుల్స్ విభాగంలో వెండి పతకాన్ని, టీమ్ ఈవెంట్లో కాంస్య పతకాన్ని గెలుపొందారు. మహిళా కానిస్టేబుల్ సరిత యోగా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. ట్రెడిషనల్ యోగాసనాలు, ఆర్టిస్టిక్



యోగాసనాల విభాగాల్లో పట్టు సాధించి రెండు కాంస్య పతకాలను తన ఖాతాలో వేసుకున్నారు.సత్యమ్మ అటు యోగాలో, ఇటు టేబుల్ టెన్నిస్ లో రాణిస్తున్నారు. ఓపెన్ డబుల్స్ లో వెండి పతకం, ఓపెన్ సింగిల్స్ లో కాంస్య పతకం సాధించారు.కబడ్డీ పోటీల్లో డి. మంజుల, టి. ప్రత్యూష, ఎం. మమత, పి. స్వర్ణలత, సాయి ప్రసన్న, వాణిశ్రీ, బి. గంగ, జి. స్వాతి, ఈ. రేణుక, కె. రాధిక, ఎస్. శిరీష మరియు రాధికల బృందం కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. టగ్ ఆఫ్ వార్ (తాడు లాగుట) విభాగంలో సిహెచ్. సంధ్యారాణి, పి. సౌందర్య, ఎం. రజిత, పి. మీన, ఎస్. శిరీష, కె. కవిత, ఎం. రేణుక, డి. శ్రీదేవి, వి. సునీత, బి. గంగలు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీటితో పాటు టేబుల్ టెన్నిస్, యోగాలో రోహిణి, ఈ. సునీత, సత్యమ్మ, సువర్ణలు మరిన్ని పతకాలను సాధించారు. అ÷-లథెటిక్స్ ఫీల్డ్ ఈవెంట్స్ లో పి. శ్వేత, ఎ. గాయత్రిలు కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

# పంచాయతీల్లో కొత్త సర్పంచ్ Vs పాత సర్పంచ్

**వరంగల్, మార్చి7( వెలుతురు):** తెలంగాణ పంచాయతీల్లో కొత్త పంచాయితీలు నెలకొంటున్నాయి. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి పాత సర్పంచ్‌లు, కొత్త సర్పంచ్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంటోంది. తాము అప్పులు తెచ్చి డబ్బులు ఖర్చు పెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని.. కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చిన నిధులను పెండింగ్ బిల్లులు చెల్లింపుల కింద ఇవ్వాలని పాత సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులకే నిధులన్నీ అయితే అభివృద్ధి ఏం చేయాలంటూ కొత్త సర్పంచ్‌లు తలలు పట్టుకుంటున్నారు.తెలంగాణలో దాదాపు 2 ఏళ్ల ఆలస్యంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. జనవరి నెలలోనే గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పడి.. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లతో పాలన సాగుతోంది. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం చేయడంతో.. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచింది. ఎన్నికలు పూర్తి అయిన తర్వాత మాత్రమే వాటిని రిలీజ్ చేస్తామని తేల్చి చెప్పింది. దీంతో ఇటీవల ఎన్నికలు పూర్తై గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు వచ్చిన తర్వాత.. దశల వారీగా 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేస్తోంది. అదే సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను కేటాయిస్తోంది. ఇక్కడే ఇప్పుడు అసలు సమస్య మొదలైందిపలు విడతల్లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 1,034 కోట్ల నిధులను ఇటీవలె విడుదల చేసింది. ఇప్పుడు ఈ నిధుల గురించే.. కొత్త సర్పంచ్‌లు, పాత సర్పంచ్‌లకు మధ్య తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తాము గతంలో సర్పంచ్ హోదాలో గ్రామాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పించామని.. వైకుంఠధామాలు, డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనులు చేసినట్లు పాత సర్పంచులు చెబుతున్నారు. ఆ పనులకు అప్పట్లో బిల్లులు రాకపోవడంతోతీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుపోతున్నాయని పాత సర్పంచ్‌లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాపు రూ.1,000 కోట్లకు పైగా పాత బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన నిధులపై తమకే హక్కు ఉంటుందని తేల్చి చెబుతున్నారు. ఇక.. కొత్త సర్పంచ్‌లు మాత్రం వాటికి ససేమిరా అనడంతో అసలు వివాదం మొదలైంది. తాము పంచాయతీ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి, గ్రామాలను డెవలప్ చేస్తామని ప్రజలకు మాట ఇచ్చామని.. ఇప్పటివరకు వచ్చిన నిధులు మొత్తాన్ని పాత బకాయిలకే చెల్లిస్తే.. ఇక గ్రామాల్లో అభివృద్ధి ఎలా చేయాలంటూ ప్రశ్నిస్తున్నారుతాము అధికారంలోకి వచ్చీ రాగానే.. కేంద్రం నుంచి విడుదలైన నిధులను ఇవ్వకపోతే.. ఇక గ్రామ పంచాయతీలను ఎలా నడపాలంటూ ప్రశ్నిస్తున్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడం కోసం కొత్త పనులు ప్రారంభించకుండా కేవలం పెండింగ్ బకాయిలు తీర్చడానికే తాము కొత్తగా పదవుల్లోకి వచ్చామా అంటూ కొత్త సర్పంచ్‌లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ నిధుల్లో కేంద్రం కొంత మాత్రమే విడుదల చేయడం.. అందులో చాలా వరకు పాత బకాయిలు చెల్లించడానికే ఉపయోగించడం వల్ల.. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, స్ట్రీట్ లైట్స్ వంటి అత్యవసర పనులు చేసేందుకు కూడా నిధులు లేకుండా పోతున్నాయని కొత్త సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని.. కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న మిగతా నిధులను కూడా త్వరగా విడుదలయ్యేలా చూడాలని తెలంగాణ గ్రామ సర్పంచుల సంఘం విజ్ఞప్తి చేస్తోంది.నిధుల విషయంలో కొత్త, పాత సర్పంచ్‌ల విషయంలో ఈ ఉద్రిక్తత తలెత్తడంతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన తాగునీరు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను.. తాజాగా విడుదలైన నిధుల నుంచి చెల్లించాలని మంత్రి సీతక్క స్పష్టం చేసింది. అదే సమయంలో పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధుల్లో నుంచి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని సూచించారు.

# గులాబీ వ్యూహం... ఇంతేనా



**హైదరాబాద్, మార్చి7( వెలుతురు):** రాజకీయం అంటేనే వ్యూహం.. ఆ వ్యూహంలో ప్రతివ్యూహం ఉండాలి. కానీ బీఆర్ఎస్ పార్టీ వ్యూహం మాత్రం ప్రస్తుతం "పులి వేషం వేసి పిల్లిలా పలకరించినట్టు" తయారైంది. ఏ ఎన్నిక వచ్చినా "ఢీ అంటే ఢీ" అని తొడకొట్టడం.. తీరా సమయం వచ్చేసరికి "అబ్బే.. మాకు ఆసక్తి లేదు" అని చేతులెత్తేయడం గులాబీ బాసులకు అలవాటుగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో తగిలిన దెబ్బ మర్చిపోకముందే తాజాగా రాజ్యసభ ఎన్నికల రూపంలో మరో 'షాక్' తగిలింది. అసెంబ్లీలో సంఖ్యాబలం లేకపోయినా, బయట మాత్రం "అభిషేక్ సింఘ్వీని అడ్డుకుంటాం.. ఫిరాయింపుదారులకు విప్ జారీ చేస్తాం.. రాజకీయం అంటే చూపిస్తాం" అంటూ కేటీఆర్, హరీష్ రావు ఊదరగొట్టారు. తీరా చూస్తే కాంగ్రెస్ నుంచి సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి రాజసం ఉట్టిపడేలా నామినేషన్లు వేశారు. మరి మన బీఆర్ఎస్ అభ్యర్థి ఎక్కడయ్యా అంటే.. "వెతుకులాటలో ఉన్నాం" అని సమాధానం వస్తోందిగులాబీ బాస్ కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఉండి అప్పుడప్పుడు ఇచ్చే స్టేట్‌మెంట్లు కార్యకర్తల్లో జోష్ నింపుతాయని అనుకుంటే అవి కాస్తా "గాలి తీసిన బెలూన్"లా మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో కేటీఆర్, హరీష్ రావులు ఎంతగా కష్టపడుతున్నా, ప్రజలు మాత్రం "అధికారం ఉన్నప్పుడేమో బయటకి రాలేదు.. ఇప్పుడు మాత్రం ఫాంహౌస్ దాటి వస్తున్నారా?" అని సెటైర్లు వేస్తున్నారు."మేము పోటీ చేస్తాం.. గెలుస్తాం" అని ఆశావహులకు ఆశలు చూపించడం.. వాళ్లు కోట్లు ఖర్చు పెట్టుకోవడానికి రెడీ అయ్యాక, "వ్యూహాత్మకంగా తప్పుకుంటున్నాం" అని ప్లేటు తిప్పేయడం బీఆర్ఎస్ మార్క్ అయిపోయింది.ప్రస్తుతం బీఆర్ఎస్ కేడర్ పరిస్థితి 'ముందు నుయ్యి వెనుక గొయ్యి'లా మారింది. అధిష్టానం చెప్పే మాటలు వింటేనేమో అతివిశ్వాసం కనిపిస్తోంది.. రిజల్ట్స్ చూస్తేనేమో అట్టడుగున ఉంటున్నారు. "కాంగ్రెస్ పరువు తీస్తాం" అని వెళ్తే చివరకు సొంత పార్టీ పరువు కాపాడుకోవడమే గగనమైపోతోంది.రాజ్యసభ ఎన్నికల నుంచి తప్పుకోవడం ద్వారా "మా దగ్గర బలం లేదు" అని బీఆర్ఎస్ అఫీషియల్‌గా ఒప్పేసుకున్నట్లయింది. మరి ఈ 'మేకపోతు గాంభీర్యం' ప్రదర్శిస్తూ వచ్చే ఎన్నికల నాటికి బీజేపీకి బీ-టీమ్ అవుతారో లేక నిజంగానే మళ్లీ పుంజుకుంటారో చూడాలి. ప్రస్తుతానికి మాత్రం తెలంగాణ పాలిటిక్స్‌లో కాంగ్రెస్ 'హస్తం' పైచేయి సాధిస్తుంటే కారు మాత్రం రివర్స్ గేర్‌లో వెళ్తోంది!

# విధేయతకు పెద్ద పీట

**మహబూబ్ నగర్, మార్చి7( వెలుతురు):** కాంగ్రెస్ పార్టీలో 'హైకమాండ్' అంటే ఒకప్పుడు అది ఒక భయం, ఒక భక్తి. కానీ తెలంగాణలో మాత్రం ఇప్పుడు సీన్ మారింది. అప్పట్లో వైఎస్సార్ తన ఆత్మబంధువు కేవీపీ కోసం అధిష్ఠానాన్ని ఎలా ఒప్పించేవారో.. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే రూట్ మ్యాప్ ఫాలో అవుతున్నట్లు కనిపిస్తోంది.పాపం ప్రియాంక గాంధీ గారు ఎంతో ఆశగా వంశీచంద్ రెడ్డి పేరును సిఫార్సు చేశారట. "మా వంశీకి ఒక అవకాశం ఇవ్వండి" అని ఆమె కోరితే.. "లేదు మేడమ్, మా 'వేం' ఉంటేనే మాకు క్షేమం" అని రేవంత్ రెడ్డి మొండికేసినట్లు సమాచారం. మొత్తానికి అధిష్ఠానం పట్టును రేవంత్ తన 'పట్టు'దలతో సడలించారు. ఢిల్లీ పెద్దల మాట నెగ్గకపోయినా, రేవంత్ మాట నెగ్గడంతో గాంధీ భవన్‌లో ఇప్పుడు కొత్త నినాదం వినిపిస్తోంది: "హైకమాండ్ ఇచ్చేది బి-ఫామ్ మాత్రమే.. అభ్యర్థిని తేల్చేది మాత్రం రేవంత్ అన్నే!"ఇక అభ్యర్థుల ఎంపిక చూస్తే.. కాంగ్రెస్ పార్టీకి కోర్టుల్లో కష్టమొచ్చినా, పొలిటికల్ కోర్టులో తలనెప్పి వచ్చినా గుర్తొచ్చే ఏకైక పేరు అభిషేక్ మను సింఘ్వీ. ఆయనకు సీటు ఇవ్వకపోతే కాంగ్రెస్ ఫైళ్లు కదిలేలా లేవు, అందుకే ఆయనకు మళ్ళీ 'పెద్దల సభ' టికెట్ ఖరారైంది. కానీ అసలు కిక్కు ఇచ్చింది మాత్రం వేం నరేందర్ రెడ్డి ఎంపికే!రేవంత్ రెడ్డి కష్టాల్లో ఉన్నా, కారాగారంలో ఉన్నా వెన్నంటి ఉన్నందుకు నరేందర్ రెడ్డికి 'రాజ్య'యోగం పట్టింది. రెడ్డి కోటాకే పట్టం కట్టింది. "అన్నీ వేరే వాళ్ళకే ఇస్తున్నారు.. మా వాళ్ళ సంగతేంటి?" అని రేవంత్ వేసిన రెడ్డి కార్డు ముందు ప్రియాంక గాంధీ మార్కు పాలిటిక్స్ కూడా పని చేయలేదు.అసెంబ్లీలో ప్రతిపక్షం బిఆర్ఎస్ పరిస్థితి 'సైలెంట్ మోడ్'లో ఉండటంతో కాంగ్రెస్ అభ్యర్థులకు పోలింగ్ అవసరం లేకుండానే గెలుపు ఖాయమైపోయింది. నామినేషన్ వేయడమే ఆలస్యం.. గెలుపు గుర్రాలు రెడీ!ఢిల్లీలో చక్రం తిప్పే పెద్దల ముందు, తెలంగాణ 'రీజనల్' చక్రం గట్టిగా తిరిగింది. వంశీచంద్ రెడ్డికి ప్రియాంక హస్తం ఉన్నా.. వేం నరేందర్ రెడ్డికి మాత్రం రేవంత్ 'మస్తీ' తోడైంది!

# క్యూర్- ప్యూర్ రీజియన్ల అడుగులు

**హైదరాబాద్ మార్చి7( వెలుతురు):** హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య 1.10 లక్షల ఎకరాల్లో భారీ గ్రీన్‌బెల్ట్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనిని 110 హరిత జోన్లుగా విభజించి ఆక్వా, అగ్రి బిజినెస్‌లను ప్రోత్సహించనుంది. రూ. 35 వేల కోట్లతో నిర్మిస్తున్న 340 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు ద్వారా 24 అర్బన్ క్లస్టర్లను అనుసంధానిస్తూ, కాలుష్య రహిత అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా.. క్యూర్.. ప్యూర్.. రేర్ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది. క్యూర్- ప్యూర్ రీజియన్ల మధ్యలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీని పరిధిలో అందుబాటులోకి వచ్చే లక్షా పది వేల ఎకరాల భూముల్లో చెరువులతో పాటు ఆక్వా కల్చర్, అగ్రి బిజినెస్ వంటి వ్యాపారాలను చేయవచ్చు. ఈ భూములను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కానీ.. ప్రైవేటు, కార్పొరేటు సంస్థలకు లీజుకివ్వడం ద్వారా గానీ గ్రీనరీని పెంపొందించి ఆర్ఆర్ఆర్ లోపల భాగంలో సకాలంలో వర్షాలు కురిసేలా చర్యలు తీసుకోనున్నారు.ఓఆర్ఆర్ చుట్టూ ప్రస్తుతం అంతగా గ్రీన్‌బెల్ట్ లేకపోవడం, ఇండ్లు, పరిశ్రమలు పెరుగుతుండడంతో కాలుష్యం పెరుగుతుందని చెబుతున్నారు. ఓఆర్ఆర్- ఆర్ఆర్ఆర్ మధ్యలో గ్రీన్‌బెల్ట్ వల్ల ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్య 110 ప్రాంతాలను హరిత జోన్లుగా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రీన్‌బెల్ట్‌కు కేటాయించనున్న 1.10లక్షల ఎకరాలను 110 గ్రీన్‌జోన్లుగా విభజించనున్నారు. ఇలా విభజిస్తే.. ప్రతి 3.5 కిలోమీటర్లకు ఒక హరిత జోన్ ఏర్పాటు కానుంది. ఇందులో ఆక్వా, అగ్రి బిజినెస్, చెట్లతో ప్రతి జోన్ ప్రాణవాయువు కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.ఇక రీజినల్ రింగు రోడ్డును రూ. 35 వేల కోట్ల వ్యయంతో 340 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్నారు. 24 అర్బన్ క్లస్టర్లు, 208 గ్రామాలను కనెక్ట్ చేస్తున్నారు. దక్షిణ తెలంగాణ పరిధిలో 182 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ రింగ్‌రోడ్డు ప్రధాన రహదారిగా మారనుంది. ఔటర్ రింగు రోడ్డుతో పాటు చౌటుప్పల్, శివన్నగూడ, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి మీదుగా వెళ్లనుంది. ఉత్తర తెలంగాణ పరిధిలో 158 కి. మీ మేర ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వద్ద ఈ రోడ్డు కలుస్తుంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

# తెలంగాణలో సైనిక్ స్కూల్ లేకపోవడం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం



**పిక్కల శ్రీనివాస్**
ఓ సైనిక్ స్కూల్ cadet పేరెంట్

*దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో సైన్యంలో చేరాలని కలలుకనే వేలాది మంది విద్యార్థులకు సైనిక్ స్కూల్స్ ముఖ్యమైన మార్గదర్శక సంస్థలు. ఈ స్కూల్స్ ద్వారా చిన్న వయసులోనే విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించి చీణూ (National Defence Academy) వంటి ఉన్నత రక్షణ సంస్థల్లో ప్రవేశం పొందేందుకు సిద్ధం చేస్తారు. అయితే, దేశంలో చాలా రాష్ట్రాల్లో సైనిక్ స్కూల్స్ ఉండగా తెలంగాణ రాష్ట్రంలో ఒక్క సైనిక్ స్కూల్ కూడా లేకపోవడం ఎంతో బాధాకరమైన విషయం.*

ఇటీవల జరిగిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలు రాసిన తెలంగాణ విద్యార్థుల పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. దేశంలోని ఇతర రాష్ట్రాల విద్యార్థులకు మంచి మార్కులు సాధించిన వెంటనే మెడికల్ పరీక్షల కోసం కాల్ లెటర్స్ మరియు ఆన్‌లైన్ లాగిన్ లో సమాచారం అందుతుండగా, తెలంగాణకు చెందిన పలువురు విద్యార్థులకు మాత్రం మంచి మార్కులు వచ్చినప్పటికీ మెడికల్ పరీక్షలకు పిలుపు రాకపోవడం తీవ్ర నిరాశను కలిగిస్తోంది. ఇది తెలంగాణ విద్యార్థుల అవకాశాలను ప్రశ్నార్థకంగా మార్చుతోంది.

తెలంగాణ రాష్ట్రం దేశంలో అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రాల్లో ఒకటి. కేంద్ర ప్రభుత్వానికి కూడా రాష్ట్రం గణనీయమైన వనరులు అందిస్తోంది. అయినప్పటికీ, రాష్ట్రంలో ఒక్క సైనిక్ స్కూల్ కూడా లేకపోవడం ఆశ్చర్యకరం. ఇది కేవలం విద్యా సంస్థల లోపం మాత్రమే కాకుండా, దేశ సేవలో పాల్గొనాలనుకునే తెలంగాణ యువతకు అవకాశాల లోటును సూచిస్తోంది.

సైనిక్ స్కూల్స్ విద్యార్థులను కేవలం చదువులోనే కాకుండా శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి భావన వంటి విలువలతో తీర్చిదిద్దుతాయి. అందువల్ల రాష్ట్రంలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సైనిక్ స్కూల్స్ స్థాపించడం అత్యంత అవసరం. దీని ద్వారా తెలంగాణ విద్యార్థులకు సమాన అవకాశాలు లభిస్తాయి మరియు భవిష్యత్తులో సైన్యంలో తెలంగాణ యువత సంఖ్య పెరుగుతుంది.

ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం కొత్త సైనిక్ స్కూల్స్ స్థాపనకు అనుమతులు ఇచ్చినప్పటికీ, తెలంగాణకు మాత్రం ఒక్క స్కూల్ కూడా కేటాయించకపోవడం నిరాశ కలిగిస్తోంది. ఇది రాష్ట్ర నాయకత్వం కేంద్ర ప్రభుత్వంతో మరింత చర్చలు జరపాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

అందువల్ల తెలంగాణ ప్రభుత్వం వెంటనే కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి రాష్ట్రంలో సైనిక్ స్కూల్ స్థాపనకు చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో తగిన భూమి, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వస్తే, సైనిక్ స్కూల్ ఏర్పాటు సాధ్యమే. తెలంగాణ యువతలో దేశ సేవ పట్ల ఉన్న ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని, రాష్ట్రానికి కనీసం ఒక సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయడం అత్యవసరం. ఇది కేవలం విద్యార్థుల భవిష్యత్తుకే కాకుండా దేశ రక్షణ వ్యవస్థకు కూడా బలాన్ని చేకూరుస్తుంది. కాబట్టి, తెలంగాణలో సైనిక్ స్కూల్ స్థాపనపై రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ప్రజలు ఆశిస్తున్నారు. తెలంగాణ పిల్లలకు కూడా సమాన అవకాశాలు కల్పించాలి; దేశ సేవలో ముందుకు వెళ్లే మార్గాన్ని ప్రభుత్వం సులభతరం చేయాలి.

ధన్యవాదాలు.

# కమలం చేతికి బీహార్..

**పాట్నా, మార్చి7( వెలుతురు):**
బిహార్‌లో రాత్రికి రాత్రి రాజకీయం మారిపోయింది. పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణ



స్వీకరారం చేసి 21 ఏళ్లుగా బిహార్‌కు దశ దిశ నిర్దేశించిన నితీశ్‌కుమార్ రాజకీయం రాష్ట్రంలో ముగిసింది. రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మార్చి 5న నామినేషన్ వేశారు. నితీశ్‌కుమార్ ఢిల్లీ రాజకీయాలకు వెళ్లనున్నారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరు అన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రిగా ఆయన పూర్తికాలం ఉంటారని ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. కానీ 5వ తేదీన నితీశ్‌కుమార్ ట్విట్టర్‌లో ఒక పోస్టు పెట్టారు. రాజ్యసభకు నామినేసన్ వేస్తున్నట్లు పేర్కొన్నారు.మార్చి 4న వన్ ఆన్ మాల్ భవనంలో జరిగిన కీలక సమావేశం నితీశ్ నిర్ణయానికి మూలం. కేంద్ర మంత్రులు సంజయ్ ఝా, రామ్‌నాథ్ ఠాకూర్, విజయ్ కుమార్ చౌహాన్, బిజేంద్ర యాదవ్ పాల్గొన్నారు; అమిత్ షా ఫోన్‌లో చేరి ఆరోగ్యం, పరిపాలనా సవాళ్లపై చర్చించారు. ఇటీవల ఆయన వ్యవహార శైలి మార్పు, మతి సమస్యల ప్రచారం, ఐఏఎస్ అధికారుల ప్రభావం ప్రజల్లో అసంతృప్తి తెచ్చాయి. మార్చి 5న ఎక్స్ పోస్ట్‌లో రాజ్యసభ ప్రయాణాన్ని ప్రకటించారు.నితీశ్ కుమారుడు 40 ఏళ్ల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ నిశాంత్ కుమార్‌ను ఉపముఖ్యమంత్రిగా చేసి పార్టీ ఐక్యత కాపాడాలని జేడీయూ వర్గాలు భావిస్తున్నాయి. రాజకీయ అనుభవం లేనప్పటికీ, తండ్రి వెంట తిరుగుతూ క్రమంగా ప్రజాధరణ సంపాదించాలని ప్రణాళిక. కుటుంబ పాలనకు వ్యతిరేకత ఉన్నా, పార్టీ స్థిరత్వం కోసం ఈ దీర్ఘకాల ప్రణాళిక రూపొందుతోంది. జేడీయూ శ్రేణులు నిశాంత్ ప్రజాధరణ లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఇక బీజేపీ ఖాతాలో మరో రాష్ట్రం రాబోతోంది. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి (నితీశ్ సమాజిక వర్గనేత), నిత్యానంద రాయ్ యాదవ్, దిలీప్ సైస్వాల్, విజయ్ కుమార్ సిన్హా సీఎం అవకాశాల్లో ముందున్నారు. బీజేపీ ఆధారంతో జేడీయూ మద్దతు ప్రభుత్వ ఏర్పాటుకు దారితీస్తుంది. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఇది నితీశ్ స్వచ్ఛంద నిర్ణయమని, భవిష్యత్ ప్రభుత్వానికి ఆయన మార్గదర్శకత్వం ఉంటుందని తెలిపారు. రాజ్యసభ స్థానం జేడీయూ ప్రభావాన్ని కొనసాగిస్తుందని ఆశ.అసెంబ్లీలో 249 స్థానాల్లో బీజేపీ 89, జేడీయూ 86, రామ్ విలాస్ పాశ్వాన్ పార్టీ 19, ఆర్‌ఎల్‌జేపీ 4 సాధించాయి. ఆర్‌ఎల్‌జేపీ బీజేపీలో విలీనం ప్రణాళిక ఆర్‌జేడీ చీల్చే అవకాశాన్ని అడ్డుకుంటుంది. ఈ మలుపుతో బీజేపీ మరో రాష్ట్రంలో సీఎం పదవి సాధించనుంది. రోహిణి ఆచార్యలు నితీశ్‌ను బీజేపీ 'కీలుబొమ్మ'గా విమర్శిస్తూ, మిత్రద్రోహానికి మూల్యం చెల్లించారని ఆరోపించారు. ఈ పరిణామం బీజేపీ బలోపేతానికి జేడీయూ బలహీనతకు దారితీస్తోంది.

# జహీరాబాద్‌లో ఘనంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు, ఈద్ - కా - తోఫా పంపిణీ

## రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకుల సమక్షంలో నిర్వహణ...

**జహీరాబాద్ వెలుతురు మార్చి 07:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, మాజీ మంత్రి, జహీరాబాద్ ఇంచార్జ్ డా. ఏ. చంద్రశేఖర్, ౧వీ=జు×ూ వైస్ చైర్మన్ & ప్రెసిడెంట్ ఫహీమ్ ఖురేషీ, ఇండస్ట్రియల్ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం మైనారిటీలకు అందజేస్తున్న ఈద్-కా -తోఫా ను పంపిణీ చేశారు. రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఈ ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిందని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మున్సిపల్ చైర్మెన్ మహమ్మద్ యూనుస్, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మాజీ ఇండస్ట్రియల్ చైర్మన్ తన్వీర్, కాంగ్రెస్ నాయకుడు డా. ఉజ్వల్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆర్డీవో, ఎంఆర్ఓతో పాటు పలువురు అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.







# మహబూబాబాద్ జిల్లాలో గిరిజనుల జాతర

**వరంగల్, మార్చి7( వెలుతురు):**
మహబూబాబాద్ జిల్లాలో గిరిజనుల జాతర మొదలయింది. నిండు పున్నమి కాంతుల్లో అడవి తల్లి పులకిస్తోంది. డోలు వాయిద్యాల మోత, శివసత్తుల పూనకాల మధ్య మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడ గ్రామంలో వెలిసిన 'కొమ్మాలమ్మ' జాతర భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. మేడారం సమ్మక్క-సారలమ్మల తరహాలోనే గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఈ వనదేవతకు 11వ శతాబ్దం నాటి ఘనమైన చరిత్ర ఉంది. సాధారణంగా దైవం అంటే విగ్రహ రూపంలో ఉంటారు. కానీ, కొమ్మాలమ్మ తల్లి ఇక్కడ కత్తి రూపంలో దర్శనమివ్వడం ఒక విశిష్టమైన సంప్రదాయం. ఆదివాసీ దేవతలందరిలో కెల్లా పెద్ద దేవతగా కొమ్మాలమ్మను కొలుస్తారు. ఒకప్పుడు గోదావరి తీరంలో వెలిసిన ఈ తల్లి, కాలక్రమేణా 'వాసం' వంశీయుల ఆరాధ్య దైవంగా ఎంచగూడ ప్రాంతానికి చేరుకుంది. ఈ దైవానికి యాలం,ఆలూరి వంశీయులు ప్రధాన పూజారులుగా వ్యవహరిస్తారు. పూర్వం ఈ ఖడ్గాన్ని తిరిగి గోదావరి ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేయగా, అరిష్టాలు సంభవించడంతో భక్తులు భయపడి తిరిగి ఎంచగూడలోనే ప్రతిష్టించారని చరిత్ర చెబుతోంది.కొమ్మాలమ్మ కేవలం దేవత మాత్రమే కాదు, ఆదివాసీల పాలిట ఒక ప్రకృతి శాస్త్రవేత్తగా విరాజిల్లుతోంది. రాబోయే ఏడాది వర్షాలు ఎలా ఉంటాయో తల్లి ముందే హెచ్చరిస్తుందని భక్తుల నమ్మకం. గద్దెపై ఉన్న ఖడ్గానికి తగిలించిన వెండి కంకణాలు కదిలి గలగలమంటూ శబ్దం చేస్తే ఆ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, ఒకవేళ కంకణాలు బిగుసుకుపోయి నిశ్శబ్దంగా ఉంటే వర్షాలు తక్కువని గిరిజనులు భావిస్తారు. వర్షాలు లేని సమయంలో ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేస్తే కచ్చితంగా వానలు కురుస్తాయని వారి ప్రగాఢ విశ్వాసం. అందుకే అత్యంత భక్తి విశ్వాసాలతో దీనిని జరపుకుంటారు.సమ్మక్క సారలమ్మలకు బెల్లాన్నిసమర్పించినట్లుగా, కొమ్మాలమ్మ తల్లికి వెండి కంకణాన్ని కానుకగా సమర్పించడం ఇక్కడి ప్రధాన ఆచారం. ముఖ్యంగా సంతానం లేని వారు తల్లిని వేడుకుంటే ఫలితం నిశ్చయమని భక్తుల నమ్మకం. కోరిక తీరిన దంపతులు తమ కృతజ్ఞతగా తల్లికి వెండి కంకణాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.ప్రతి రెండేళ్లకు ఒకసారి కోనాపురం అడవుల నుండి సేకరించిన ప్రత్యేక వెదురు కంకలు, ఎర్రని జెండాలు ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సమ్మక్క బండారి వంశానికి చెందిన వారు కాగా, కొమ్మాలమ్మ కూడా అదే బండారి వంశీయుల మహాశక్తిగా పూజలందుకోవడం విశేషం. అగ్ని రూపంలో గద్దెపైకి చేరే వనదేవత, అడవి బిడ్డల కష్టాలను తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతోంది.

# హస్తిన కాలింగ్...





**హైదరాబాద్, మార్చి7( వెలుతురు):**
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీకి పిలవడం ఇప్పుడు హస్తం పార్టీలోనే కాదు పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మొన్న వికారాబాద్‌లో పర్యటించిన రాహుల్ గాంధీ..స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఢిల్లీ వచ్చి కలవమని చెప్పారట. పార్టీ శిక్షణా తరగతుల వేదికైన వికారాబాద్ నియోజకవర్గానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యేగా ఉన్నారు. దీంతో ఆయన రాహుల్ గాంధీకి స్వాగతం పలకడంతో పాటు వీడ్కోలు చెప్పేందుకు హెలిప్యాడ్ దగ్గరికి వెళ్లిన సందర్భంగా..ప్రసాద్ కుమార్‌తో మాట్లాడిన రాహుల్ ఢిల్లీకి వచ్చి కలవమని ప్రత్యేకంగా చెప్పారని తెలుస్తోంది.స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను రాహుల్ గాంధీ ఎందుకు ఢిల్లీకి పిలిచారన్నదానిపై గాంధీభవన్ వర్గాల్లో రకరకాలుగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, అందులోనూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ స్వయంగా ఢిల్లీ రమ్మని స్పెషల్‌గా స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను పిలిచారంటే సమ్‌థింగ్ ఈజ్ దేర్ అన్న టాక్ వినిపిస్తోంది. ఏదో బలమైన కారణం లేకుండా రాహుల్ ఎవరినీ ఢిల్లీకి వచ్చి కలవాలని చెప్పరని, అలాంటిది స్పీకర్ పదవిలో ఉన్న ప్రసాద్ కుమార్‌ను హస్తినకు రావాలని పిలిచారంటే కచ్చితంగా ఏదో ఉందని హస్తం పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.ఈ మధ్య స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాలా బిజీగా ఉంటున్నారు. పార్టీ ఫిరాయింపు కేసులను విచారిస్తున్నారాయన. సుప్రీంకోర్టు డైరెక్షన్స్‌తో జంపింగ్ ఎమ్మెల్యేల విచారణను స్పీడప్ చేసిన స్పీకర్ ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చారు. ఇక కడియం శ్రీహరి విచారణ పూర్తి కాగా తీర్పును రిజర్వ్ చేశారు. మరోవైపు ఇంకా దానం నాగేందర్ కేసు తుది విచారణను బాకీ ఉంది. ఇలా పార్టీ ఫిరాయింపుల కేసు విచారణతో స్పీకర్ ప్రసాద్ కుమార్ బాగా విసిగిపోయారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడంపై ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ స్పీకర్ తీరుపై విమర్శలు గుప్పిస్తోంది. ఇక మరో ఇద్దరు ఎమ్మెల్యేలపై ఎలాంటి తీర్పు ఇస్తారన్నదానిపై రాజకీయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ వ్యవహారమంతా స్పీకర్ ప్రసాద్‌కు హెడెక్‌గా మారిందట. అసెంబ్లీ సమావేశాల నిర్వహణ కూడా ప్రసాద్ కుమార్‌కు తలకు మించిన భారంగా మారిందన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి సిచ్యువేషన్‌లో రాహుల్ గాంధీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను ఢిల్లీకి పిలవడం వెనుక రీజనేంటన్నదానిపై ఉత్కంఠ నెలకొందిపార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్స్‌పై విచారణ క్లైమాక్స్‌కు చేరుకున్న నేపథ్యంలో ఆ అంశంపై చర్చించేందుకు పిలిచి ఉంటారా అన్నదానిపై గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక మంత్రివర్గంలో ఇంకా రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. అమాత్య పదవుల కోసం చాలా మంది ఆశలు పెట్టుకోగా.. అందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రేసులో ఉన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారటమంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడు ప్రసాద్ కుమార్ హైకమాండ్ కు లేఖ రాశారు. కానీ అప్పుడు క్యాబినెట్‌లో ఆయనకు చోటు దక్కలేదు. అయితే మంత్రిపదవిపై ప్రసాద్ కుమార్ ఇంకా ఆశలు పెట్టుకున్నారట. ఇలాంటి ఈక్వేషన్స్ నేపథ్యంలో ఢిల్లీకి వచ్చి కలవమని రాహుల్ గాంధీ చెప్పడంతో గడ్డం ప్రసాద్‌లో మళ్లీ ఆశలు చిగురించాయని అంటున్నారు. మరి స్పీకర్‌ను రాహుల్ ఢిల్లీకి పిలిచింది మంత్రివర్గంలో బెర్త్ కోసమా? లేక ఫిరాయింపు అంశంపై చర్చించేందుకా? అన్నదే ఇప్పుడు కాంగ్రెస్ వర్గాలతో పాటు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఉత్కంఠ రేపుతోంది.అయితే ఒకవేళ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై డిస్కస్ చేస్తే..రాహుల్‌తో భేటీ తర్వాత స్పీకర్ నిర్ణయం ఎలా ఉండబోతోంది? మంత్రి వర్గంలో చోటు కోసమైతే గడ్డం ప్రసాద్ ప్లేస్‌లో స్పీకర్ అయ్యేదెవరనేది కూడా చర్చనీయాంశంగా మారింది. ప్రసాద్‌కుమార్‌ను క్యాబినెట్‌లోకి తీసుకుంటే..ఇప్పటికే మంత్రివర్గంలో ఉన్న ముగ్గురు ఎస్సీ ఎమ్మెల్యేల్లో ఒకరికి స్పీకర్ పదవి కట్టబెట్టే అవకాశం ఉందంటున్నారు. రాహుల్‌తో స్పీకర్ భేటీ తర్వాత ఏం జరగబోతోందో చూడాలి.

# తెలంగాణలో సహకార క్లబ్ లు

**వరంగల్, మార్చి7( వెలుతురు):**
సహకార వ్యవస్థపై యువతలో అవగాహన పెంచే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ఒక వినూత్న కార్యక్రమానికి అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో విద్యావ్యవస్థతో అనుసంధానంగా ప్రత్యేకంగా 'సహకార క్లబ్‌లను' ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాబోయే వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు ఈ రంగంపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించేందుకు సహకార శాఖ సన్నాహాలు ముమ్మరం చేసింది.ప్రస్తుతంరాష్ట్రంలో వ్యవసాయ, చేనేత, మత్స్య, గృహ నిర్మాణ, పారిశ్రామిక, ఉద్యోగ తదితర రంగాల్లో కలుపుకుని దాదాపు 52 వేలకు పైగా సహకార సంఘాలు సేవలు అందిస్తున్నాయి. కొత్తవాటి ఏర్పాటు కోసం నిత్యం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ సొసైటీల నిర్వహణ, ప్రభుత్వ రాయితీలు, చట్టపరమైన నిబంధనలపై చాలామంది నిర్వాహకులకు సరైన అవగాహన ఉండటం లేదు. దీనివల్ల నిర్వహణలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ లోటును భర్తీ చేసి, భవిష్యత్తులో సహకార సంఘాలను అత్యంత సమర్థవంతంగా నడిపే నాయకత్వాన్ని, అవగాహన ఉన్న పౌరులను విద్యార్థి దశ నుంచే తయారు చేయాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం అమలు కోసం సహకార శాఖ ఉన్నతాధికారులు త్వరలోనే అన్ని వర్సిటీలు, డిగ్రీ కాలేజీల యాజమాన్యాలకు అధికారిక మార్గదర్శకాలతో లేఖలు రాయనున్నారు. ప్రతి కళాశాల నుంచి చదువు పట్ల ఆసక్తి ఉన్న 100 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఈ క్లబ్‌లను స్థాపిస్తారు (చివరి సంవత్సరం విద్యార్థులకు ఇందులో మినహాయింపు ఉంటుంది). ఎంపికైన వారికి వేసవి సెలవుల్లో నెల రోజుల పాటు నిపుణులైన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు, వీడియోల ద్వారా సహకార వ్యవస్థ విశిష్టత, సేవలపై సమగ్రంగా బోధిస్తారు. విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం.. ఆదర్శవంతంగా నడుస్తున్న రాష్ట్ర సహకార బ్యాంకు , విజయ డెయిరీ, ములకనూర్ సొసైటీల సందర్శనకు నేరుగా తీసుకెళ్తారు. ఈ నెల రోజుల శిక్షణకు క్రమం తప్పకుండా హాజరైన విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక భృతి (స్టైపెండ్) కూడా అందజేయనుంది.

https://epaper.velthuru.com

వెలుతురు

cinema

# గద్దర్ సినీ అవార్డుల ప్రకటన


- చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డు
- కమలహాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు
- సుద్దాల అశోక్ తేజకు సినారె అవార్డు
- ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి
- ఉత్తమ ద్వితీయ చిత్రంగా దండోరా
- ఉత్తమ తృతీయ చిత్రంగా ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
- ఉత్తమ నటుడిగా నాగచైతన్య.. ఉత్తమ నటిగా రష్మిక మందన్నా
- ఉత్తమ దర్శకుడిగా సాయిలు
- ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్
- ఉగాది రోజు అవార్డుల బహుకరణ




గద్దర్ సినీ అవార్డులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. 2025లో విడుదలైన చిత్రాలకు గద్దర్ అవార్డులను శనివారం ప్రకటించారు. అగ్ర నటుడు చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో సత్కరించనున్నారు. ఇక, ప్రముఖ నటుడు కమల్ హాసన్‌ను పైడి జయరాజ్ అవార్డు, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజను సినారె అవార్డు వరించింది. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికెట్ పొందిన చిత్రాలకు, షార్ట్‌ఫిల్మ్‌లకు ఈ అవార్డులు ప్రకటించారు. మార్చి 19 ఉగాది రోజున ఈ పురస్కారాల ప్రదానం జరగనుంది. ఈ ప్రకటన సినీ వర్గాల్లో, అభిమానుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. గతేడాది ప్రారంభమైన ఈ పురస్కారాల పరంపర, ఈసారి మరిన్ని ప్రతిష్ఠాత్మక విభాగాలతో ముందుకు వచ్చింది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవికి 'ఎన్టీఆర్ నేషనల్' అవార్డు ప్రకటించడం విశేషం. తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో సినీ కళాకారులకు గద్దర్ అవార్డులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దాదాపు దశాబ్ద కాలంపాటు నిలిచిపోయిన ప్రభుత్వ పురస్కారాల సంప్రదాయం రేవంత్‌రెడ్డి సర్కార్‌లో మళ్లీ ప్రారంభం కావడంతో కళాకారులకు ఎంతగానో ప్రోత్సాహంగా ఉందని సినీ ప్రముఖులు చెబుతున్నారు. ఈసారి ఉగాది రోజున సినీతారల సందడితో ఈ వేడుకను అత్యంత వైభవంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించనుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' రెండో విడత విజేతలను జ్యూరీ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది అవార్డుల్లో దిగ్గజ నటీనటులు, సాంకేతిక నిపుణులకు పెద్దపీట వేశారు. ఈ ఏడాది వివిధ విభాగాల్లో ఎంపికైన ప్రముఖుల జాబితాను



ప్రకటించింది. స్పెషల్ అవార్డుల విభాగంలో ఎన్టీఆర్ జాతీయ అవార్డు - చిరంజీవిని వరించింది. రఘుపతి వెంకయ్య అవార్డు - రమేశ్ ప్రసాద్, పైడి జయరాజ్ అవార్డు - కమల్ హాసన్,నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - అశ్వనీదత్,ఏఎన్ఆర్ అవార్డు - జయసుధ, టీఎల్.కాంతారావు అవార్డు - ఆర్.నారాయణ మూర్తి,సి.నారాయణ రెడ్డి అవార్డు - సుద్దాల అశోక్ తేజ,బీఎన్ రెడ్డి అవార్డు - సింగీతం శ్రీనివాసరావులను వరించాయి. ఇక ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి, ఉత్తమ ద్వితీయ చిత్రంగా దండోరా, ఉత్తమ తృతీయ చిత్రంగా ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షోలను




ఎంపిక చేశారు. ఉత్తమ నటుడు - నాగచైతన్య (తండేల్),ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్),ఉత్తమ





దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి),బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ అన్ నేషనల్ ఇంటిగ్రేషన్ - తండేల్,ఉత్తమ సందేశాత్మక చిత్రం - కోర్ట్,ఉత్తమ ప్రజాదరణ చిత్రం - సంక్రాంతికి వస్తున్నాం,ఉత్తమ నూతన దర్శకుడు - సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్),ఉత్తమ బాలల చిత్రం-అనగనగా ఉత్తమ సహాయ నటుడు - శివాజీ (దండోరా),ఉత్తమ సహాయ నటి - భూమిక (యుఫోరియా),ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్ (దండోరా),ఉత్తమ గాయకుడు - అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి),ఉత్తమ గాయని - సాహితీ చాగంటి (కన్నప్ప), ఉత్తమ బాలనటుడు - మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో),ఉత్తమ కథా రచయిత - గుణశేఖర్ (యుఫోరియా),ఉత్తమ స్క్రీన్ ప్లే - అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం),ఉత్తమ గేయ రచయిత - నందకిశోర్ (కుబేర),ఉత్తమ సినిమాటోగ్రాఫర్ - కార్తీక్ ఘట్టమనేని (మిరాయ్),ఉత్తమ ఎడిటర్ - శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్),ఉత్తమ ఆడియోగ్రాఫర్ - ఎం.ఆర్ రాధాకృష్ణన్ (కిష్కింధపురి),ఉత్తమ కొరియోగ్రాఫర్ - సందీప్ (ఛాంపియన్),ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్ - తోటతరణి (ఛాంపియన్),ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ - గోవిందరాజు (అఖండ -2),ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ - చంద్రకాంత్ (ఛాంపియన్),ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్ - పీటర్ హెయిన్స్ (ఛాంపియన్),స్పెషల్ జ్యూరీ అవార్డుల కింద శ్రీరాజ్ రాచకొండ (23 ఫిల్మ్),చైతు జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి),రోషన్ మేక (ఛాంపియన్),అనంతిక (8 వసంతాలు)కు దక్కాయి. గద్దర్ అవార్డులపై సినీరంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ అవార్డులను మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించే వేడుకలో ప్రదానం చేయనున్నారు. స్పెషల్ జ్యూరీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ నేతృత్వంలోని కమిటీ ఈ అవార్డులను ఎంపిక చేసింది.

## చిరుకు ఎన్టీఆర్ అవార్డు రావడం అభినందనీయం

### అవార్డు విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్

### నాగచైతన్యకు అవార్డుపై నాగార్జున ఆనందం


అగ్ర కథానాయకుడు చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారం వరించింది. దీంతో ఆయనకు అభినందనలు చెబుతూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోస్ట్ పెట్టారు. ఈ వార్త తనకెంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవి ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. గద్దర్ అవార్డులకు ఎంపికైన ప్రతి ఒక్కరికీ పవన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇక ఈ అవార్డు విజేతలకు అగ్ర కథానాయకుడు నాగార్జున కూడా సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తన కుమారుడు నాగచైతన్యను ప్రత్యేకంగా అభినందించారు. చైతూ ఉత్తమ నటుడిగా ఎంపికైనందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. 'తండేల్' సినిమాలో అద్భుతంగా నటించాడని, ఈ అవార్డుకు అతడు అర్హుడని కొనియాడారు. 'దుల్ల కొడతా నాన్న' అంటూ తండేల్ డైలాగుకు హార్ట్ ఎమోజీ జోడించి అభినందించారు. తెలంగాణ ప్రభుత్వానికి నాగార్జున కృతజ్ఞతలు తెలిపారు. ఏయన్నార్ పేరుతో అవార్డును ప్రకటించడంపై హర్షం వ్యక్తం



చేశారు. ఏయన్నార్ అవార్డు జయసుధకు రావడం ఆనందంగా ఉందన్నారు.తాజాగా ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో ఈటీవీ విన్ సత్తా చాటింది. నాణ్యమైన కంటెంట్‌తో కుటుంబ ప్రేక్షకులను అలరించేందుకు ఎప్పుడూ ముందుండే ఈటీవీ విన్ ఏకంగా 6 అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సంస్థ నిర్మించిన రాజు వెడ్స్ రాంబాయి 4 అవార్డులకు ఎంపిక కాగా.. ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ (డెబ్యూ)గా లిటిల్ హార్ట్స్, ఉత్తమ బాలల చిత్రంగా అనగనగా నిలిచాయి.

## దీపికకు మద్దతు ప్రకటించిన అనన్య పాండే

ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశంపై తాజాగా నటి అనన్య పాండేమాట్లాడారు. కరీనా కపూర్, కల్యాణి ప్రియదర్శన్‌లతో కలిసి ఆమె 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో వర్కింగ్ అవర్స్ గురించి ప్రస్తావించారు. 'దీపికా పదుకొణె అంకితభావం ఉన్న నటి. నేను ఆమెతో కలిసి పని చేశాను. అప్పుడు దీపిక ఎలాంటి డిమాండ్లు చేయలేదు. వర్క్‌షాప్‌లకు కూడా వచ్చేవారు. షూటింగ్ విషయంలో ఎప్పుడూ ఫిర్యాదులు చేయలేదు. ఇప్పుడు ఆమె ఒక బిడ్డకు తల్లి. ఆ పాపకు కనీసం రెండేళ్లు అయినా పూర్తిగా దీపిక అవసరం ఉంటుంది. అందుకే ఇప్పుడు ఇలాంటి డిమాండ్ చేశారు. ఇందులో తప్పేం లేదు. ఆమె డిమాండ్‌కు పూర్తి మద్దతు ఇస్తాను' అని అనన్య అన్నారు. కరీనా తల్లి అయిన తర్వాత ఇండస్ట్రీలో పాత ఆలోచనా ధోరణిని మార్చేశారని అనన్య అభిప్రాయపడ్డారు. ఆమె తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఇప్పుడు వస్తోన్న హీరోయిన్లకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నాయన్నారు. పరిశ్రమలో హీరోయిన్స్ తమ వ్యక్తిగత జీవితానికి, వృత్తికి మధ్య సమతుల్యత పాటించేలా నిర్మాతలతో చర్చలు జరపడంలో తప్పులేదని అనన్య పేర్కొన్నారు. పని వేళల విషయంలో ఎటువంటి కఠినమైన నిబంధనలు ఉండకూడదన్నారు. దీపికా లాంటి స్టార్ హీరోయిన్ ఇలాంటి మార్పును డిమాండ్ చేయడం వల్ల భవిష్యత్తులో అందరికీ మేలు జరుగుతుందని పేర్కొన్నారు.



## ఉస్తాద్ భగత్‌సింగ్.. నెట్‌ఫ్లిక్స్‌తో కుదరిన డీల్

ఉస్తాద్ భగత్ సింగ్'గా ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్ . ఆయన ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని హరీశ్ శంకర్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా




ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న హరీశ్ శంకర్ ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. సినిమా షూటింగ్ ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే ఓటీటీ డీల్ కుదిరినట్లు ఆయన తాజాగా తెలిపారు. తన వ్యక్తిగత పరిశీలన కోసం కీలక సన్నివేశాలను ఎడిట్ చేసి ఒక చిన్న వీడియో సిద్ధం చేసుకున్నానని.. ఆ విజువల్స్ చూసిన నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులు సినిమాపై సంతృప్తి వ్యక్తం చేశారని హరీశ్ శంకర్ పేర్కొన్నారు. ఆ క్లిప్స్‌లోని కంటెంట్, మేకింగ్ స్టైల్ నచ్చడంతో 20 నిమిషాల్లోనే డీల్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆయన వివరించారు. రూ.80కోట్ల కు ఈ సినిమా ఓటీటీ డీల్ కుదిరినట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత పవన్ - హరీశ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఓవర్సీస్‌లో దీని బుకింగ్స్ కూడా ప్రారంభమైన విషయం తెలిసిందే.

## దురంధర్-2 ట్రైలర్ విడుదల

### 19న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు నిర్ణయం

### టిక్కెట్ ధరలు పెంచకుండానే బుకింగ్స్

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన చిత్రం 'ధురంధర్' గతేడాది చివర్లో విడుదలై సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్‌గా 'ధురంధర్:ది రివెంజ్' రానుంది. ఈ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మొదటి భాగం హిందీలో మాత్రమే విడుదల కాగా.. రెండో పార్ట్ హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు ఈసారి పాకిస్థాన్ భవిష్యత్‌ను నిర్ణయించేది భారత్' అంటున్నారు రణ్‌వీర్ సింగ్. ఆయన కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్2: ది రివెంజ్'. సారా అర్జున్ కథానాయిక. మాధవన్, సంజయ్‌దత్, అర్జున్ రాంపాల్ కీలక పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా శనివారం విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచింది. 'ధురంధర్: పార్ట్1'తో పోలిస్తే రెండో భాగంలో యాక్షన్‌తో పాటు ఎమోషనల్ డ్రామాకు పెద్ద పీట వేసినట్లు తెలుస్తోంది. మరోవైపు 'ధురంధర్'కు వచ్చిన క్రేజ్‌ను ఒడిసిపట్టుకునేందుకు చిత్ర బృందం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా ఒకరోజు ముందుగానే పెయిడ్ ప్రీమియర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. అంటే మార్చి 18వ తేదీ సాయంత్రం ఫస్ట్ షో నుంచే 'ధురంధర్2: ది రివెంజ్' మూవీని ప్రదర్శించబోతోంది. ఇప్పటికే బుక్‌మై షో, డిస్ట్రిక్ట్




యాప్‌ల ద్వారా టికెట్ బుకింగ్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. హిందీతో పాటు, ఇతర దక్షిణాది భాషల్లో ఈ సినిమాను తీసుకొస్తున్నా.. పెయిడ్ ప్రీమియర్స్ వరకు హిందీలోనే బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. హైదరాబాద్‌లోని వివిధ మల్టీప్లెక్స్‌లలో ఇప్పటికే టికెట్స్ అందుబాటులోకి వచ్చాయి. సాధారణంగా పెయిడ్ ప్రీమియర్స్‌కు టికెట్ ధర స్పెషల్‌గా ఉంటుంది. కానీ, 'ధురంధర్2' టికెట్ ధరల్లో ఎలాంటి పెంపు లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం బుకింగ్స్ మొదలైన నేపథ్యంలో సినిమా రన్‌టైమ్‌పైనా స్పష్టత వచ్చింది. ఇప్పటి వరకూ సోషల్‌మీడియా వేదికగా జరిగిన చర్చలకు ఫుల్‌స్టాప్ పెడుతూ 'ధురంధర్ 2: ది రివెంజ్' నిడివి 3 గంటల 55 నిమిషాలతో రానున్నట్లు బుక్‌మై షోలో చూపిస్తోంది. మొదటి భాగం 3 గంటలా 34 నిమిషాలతో పోలిస్తే చాలా ఎక్కువే. ఇంటర్వెల్‌తో కలిపి దాదాపు నాలుగు గంటలపైనే ప్రేక్షకుడు థియేటర్‌లో ఉండాలి. గతేడాది కేవలం హిందీలోనే విడుదలైన 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా హిందీతో పాటు, తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇక 'ధురంధర్2'లో అనేక ప్రశ్నలకు సమాధానం లభించనుంది.

# అసోం రైఫిల్స్ శిక్షణ భేష్

- సైనికులారా భరత మాత సేవకు సిద్ధంకండి
- మీ పనితీరుతో అసోం రైఫిల్స్ కు మరింత పేరు తీసుకురావాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- నాగాలాండ్ లో అసోం రైఫిల్స్ రైఫిల్స్ శిక్షణా కేంద్రం 'సైనిక నియామకాల ఉత్సవాల్లో' పాల్గొన్న కేంద్ర మంత్రి
- బండి సంజయ్ సమక్షంలో 764 మంది సైనికుల ప్రమాణం
- సుఖోవిలో అసోం రైఫిల్స్ శిక్షణ కేంద్రంలో శౌర్య స్థల్ ను ప్రారంభించిన కేంద్ర మంత్రి














**నాగాలాండ్ వెలుతురు మార్చి 07:**
క్రమశిక్షణతో అద్భుతమైన శిక్షణనిస్తూ శారీరకంగా-మానసికంగా దృఢమైన సమర్థులైన సైనికులను తయారు చేయడంలో అసోం రైఫిల్స్ శిక్షణా కేంద్రం పనితీరు బాగుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. శనివారం రోజున ఉదయం నాగాలాండ్ రాష్ట్రంలోని దిమాపుర రీజియన్ సుఖోవిలోని అసోం రైఫిల్స్ శిక్షణా కేంద్రం పాఠశాల (ూాంయిఎ =అటశ్రీవం ంతీుఱఅఱఅస్త్ర జవత్తీవ& ూఎష్ట్రశీశీశ్రీ)లో శిక్షణ పూర్తి చేసుకున్న సైనికుల 'ప్రమాణ స్వీకార' ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరేడ్ లో 762 మంది శిక్షణ పూర్తి చేసుకున్న సైనికులు ముక్తకంఠంతో కేంద్ర మంత్రి సమక్షంలో ప్రమాణం చేశారు.
అనంతరం అసోం రైఫిల్స్ నిర్వహించిన పరేడ్ విన్యాసాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ తిలకించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న సైనికులను ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ "మీరే రేపటి జవాన్లు, చీజూలు, జీజూ లు. మీలో కొందరు భవిష్యత్తులో అధికారులు కూడా అవుతారు. ప్రతి సైనికుడి విధి మీ దళ గౌరవాన్ని ఎప్పుడూ కాపాడాలి. మీ ప్రవర్తన వల్ల దళానికి లేదా యూనిఫాం కి ఎలాంటి చెడు పేరు రాకూడదు. ఒక సైనికుడికి తన పని చేయడమే అతని ధర్మం. మీరు చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకుని, భరత మాత సేవకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండండి."అని కోరారు.
"శనివారం రోజున అస్సాం రైఫిల్స్ చరిత్రలో ఒక ముఖ్యమైన రోజు. ఇంత మంది (762 రిక్రూట్లు) శపథం చేసి ఈ గౌరవమైన దళంలో చేరడం చాలా ఆనందంగా ఉంది. పురుషులు, మహిళలు కలిసి శపథం చేయడం మన దేశం యొక్క మారుతున్న ముఖచిత్రాన్ని ప్రతిబింబిస్తుంది. మీరు మీ జీవితాన్ని, మీ కుటుంబ జీవితాలను మెరుగుపరుచుకోవడమే కాకుండా, దేశాన్ని నిరంతరం ముందుకు తీసుకెళ్లడానికి రాబోయే తరం యువతీ, యువకులను కూడా ఆదర్శంగా నిలుస్తున్నారు"అని అన్నారు.
అసోం రైఫిల్స్ శిక్షణా కేంద్రంలో సైనికుల శిక్షణ కోసం కష్టపడి పనిచేస్తున్నారని అభినందించారు. మంచి సైనికులను తయారు చేసిన ూాౌజ & ూ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. "కేంద్ర సాయుధ దళాల శిక్షణ విధానం గురించి నాకు తెలుసు. మీ శిక్షణ చూసి అస్సాం రైఫిల్స్ దాని సంస్థాగత ప్రతిభకు, గౌరవానికి ప్రసిద్ధి చెందిందని, దాని శిక్షణ కూడా అసమానమైనదని స్పష్టంగా తెలుస్తోంది."అని వ్యాఖ్యానించారు. "భవిష్యత్తులోఃనూ అస్సాం రైఫిల్స్ శిక్షణా కేంద్రం ఆధునిక పద్ధతులతో శిక్షణ ఇస్తూ, సమర్థవంతమైన, నైపుణ్యం కలిగిన కొత్త యుద్ధ విధానాలు నేర్పుతూ మంచి పేరు తెచ్చుకుంటుందని ఆశిస్తున్నాను"అని పేర్కొన్నారు.
పరేడ్ ముగిసిన అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ అసోం రైఫిల్స్ పరేడ్ మైదానంలో సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన "శౌర్యస్థల్"ను ప్రారంభించారు. అసోం రైఫిల్స్ సైనికుల వీరత్వం, త్యాగం, వారి గొప్ప సైనిక చరిత్రను గుర్తు చేసుకునేలా ఈ స్మారక స్థలాన్ని నిర్మించారు. మధ్యలో అశోక చక్రంతో స్తంభాన్ని ఏర్పాటు చేశారు. మన దేశ చరిత్రను, సంప్రదాయ విలువలను ఈ స్థూపం తెలియజేస్తుంది. పక్కనున్న గోడలపై ఉన్న చిత్రాలు అస్సాం రైఫిల్స్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు పాల్గొన్న యుద్ధాలు, ఆపరేషన్లను గుర్తుకు తెస్తాయి. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల కథలను స్మరించుకునేలా చిత్రాలను రూపొందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ "శౌర్య స్థల్ శిక్షణ పొందుతున్న సైనికులకు సైనిక జీవితానికి సంబంధించిన నిజమైన అవగాహన కల్పిస్తుంది. వారిలో క్రమశిక్షణ, దేశభక్తి, త్యాగ నిరతిని పెంపొందిస్తుంది. అలాగే అధికారిక కార్యక్రమాలు, వేడుకలు మరింత గౌరవప్రదంగా జరిగేలా మరియు వివిధ ర్యాంకులలో ఉన్న సిబ్బందిలో అంకితభావం, ధైర్యాన్ని పెంచడం ఈ శౌర్యస్థల్ ప్రధాన ఉద్దేశ్యం."అని తెలిపారు.
ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ అసోం రైఫిల్స్ లో నూతనంగా చేరిన జవాన్లతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన జవాన్ల తల్లిదండ్రులతో కలిసి ముచ్చటించారు. వీరిలో పలువురు తెలుగు కుటుంబాలు కూడా ఉండటం గమనార్హం. అసోం రైఫిల్స్ లో సైనికుడిగా చేరిన తన మొదటి కొడుకు దేశం కోసం సేవ చేస్తూ బలిదానమయ్యారు. అయినా నాకు ఇంకో కొడుకు ఉన్నాడు. వాడిని కూడా అసోం రైఫిల్స్ లో చేర్పించాను. ఈరోజు శిక్షణ పూర్తి చేసుకుని మీ సమక్షంలో ప్రమాణం చేయడం సంతోషంగా ఉంది"అని కర్నాటకు చెందిన ఓ మహిళ ఆనంద బాష్పాలు రాలుస్తూ చెప్పడం అక్కడున్న వారందరినీ కదిలించింది.

## ఈ సీజన్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రతలు

- వాడగాలులు వీచే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ హెచ్చరిక



**హైదరాబాద్, మార్చి7( వెలుతురు):**
రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారుతున్నది. ఈ సీజన్‌లోనే అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకావం ఉందని వాతావరణ శ్శాఖ హెచ్చరించింది. తీవ్రమైన ఎండలతో పాటు వడగాల్పులు వీచే అవకాశమున్నదని హెచ్చరించింది.రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరుగనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ సూచించింది. తరుచుగా తగిన మోతాదులో నీరు తాగాలని సూచించారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ప్రయాణాలను తగ్గించుకోవాలని కోరారు.ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, మంచిర్యాల, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలంటూ వాతావరణ కేంద్రం రెడ్‌అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రత 39 నుంచి 41 డిగ్రీలకు చేరిందని, రాబోయే నాలుగు రోజులు ఇవే గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని పేర్కొంది. హైదరాబాద్ నగరంలో కూడా గతంలో కంటే భిన్నంగా మార్చిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37-38 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఆదిలాబాద్ అర్బన్, ధర్మపురి, ఖమ్మం అర్బన్ ప్రాంతాల్లో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో 14 జిల్లాల్లో 38.5 డిగ్రీలపైనే రికార్డు అయ్యింది. మరోవైపు ఎండలు పెరుగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిదని అధికారులు హెచ్చరించారు.ఉత్తర భారతదేశం నుంచి వీస్తున్న పొడిగాలుల కారణంగానే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా యని వాతావరణ కేంద్రం తెలిపింది. సాధారణంగా మార్చి మూడో వారం తర్వాత ఎండలు పెరుగుతాయి. కానీ ఈసారి తొలి వారంలోనే వేడి తీవ్రత మొదలైంది. శనివారం ఆరు జిల్లాల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. జయశంకర్-భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

## జాతీయ ఎస్సీకమిషన్ చైర్మన్‌కు అస్వస్తత

- అధకారులతో సమీక్ష చేస్తుండగా వాంతులు

**రాజమండ్రి, మార్చి7( వెలుతురు):**
రాజమండ్రి పర్యటనలో ఉన్న జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మాక్వానా శనివారం అస్వస్తతకు గురయ్యారు. ఆయన రాజమండ్రిలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో కిషోర్ మాక్వానా.. స్వల్ప అస్వస్థతకు గురికావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాజమండ్రిలోని ఓఎన్జీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఓఎన్జీసీ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. సమావేశం జరుగుతున్న సమయంలోనే కిషోర్ మాక్వానా అస్వస్థతకు గురయ్యారు. ఈ సమావేశంలో ఉండగానే ఆయనకు వాంతులు కావడంతో వెంటనే అధికారులు స్పందించి సమీపంలోని డెల్టా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతున్నట్లు సమాచారం. అధికారులు వెంటనే స్పందించడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కిషోర్ మాక్వానా చికిత్స పొందుతున్నారు.

## తిరుమల లడ్డూపై పదేపదే అవాస్తవాలు

- చంద్రబాబు కుట్ర రాజకీయాలు
- జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే విమర్శలు
- వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి



**అమరావతి, మార్చి7( వెలుతురు):**
వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపారని చంద్రబాబు పదేపదే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, కెమికల్ కలిపారని దుష్ప్రచారం చేశారు. వైఎస్సార్సీపీని రాజకీయంగా దెబ్బతీయాలని చంద్రబాబు ఎ÷-లాన్. వైఎస్సార్‌సీపీ హయాంలో క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను తీసుకొచ్చాం. మార్కెట్లో ఫిబ్రవరి 24న కేజీ హెరిటేజ్ నెయ్యి రూ.541 ఉంది. అదే రోజు మార్కెట్‌లో ఇందాపూర్ నెయ్యి రూ.578గా ఉంది. కేజీ అమూల్ నెయ్యిని రూ.525కే ఇస్తున్నారు' అని సజ్జల తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థాన లడ్డూలో జంతు కొవ్వు కలవలేదని కేంద్ర దర్యాప్తు బృందం ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సుప్రీంకోర్టు తెలిపిందని అన్నారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని చెప్పిన తర్వాత కూడా సీఎం, డిప్యూటీ సీఎం, చివరికి హోం మంత్రి కూడా దిగజారి మాట్లాడుతున్నారని చెప్పారు. వారి తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అసెంబ్లీలో కూటమి నేతలు లేనిపోనివన్నీ మాట్లాడుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. కూటమి నేతలు భక్తుల మనోభావాలను దెబ్బతీయవద్దు. లడ్డూ అంశాన్ని డైవర్ట్ చేయడానికి కులాల ప్రస్తావన తీసుకురాకూడదు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు పెట్టినా కూటమిని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. రాజకీయాల్లో ఉన్నారు.. ప్రజలకు మంచి చేయండి.. అని అన్నారు.

## హింసను కోరిన ప్రేమపెళ్లి

- వరుడి బంధువులపై పెళ్లికూతరు బంధువుల దాడి
- ఆస్పత్రిలో చేరిన దాడిలో గాయపడ్డ వారు

**ఖమ్మం,మార్చి7( వెలుతురు):**
వారిద్దరూ ప్రేమించుకున్నారు. ఊరినుంచి పరారై.. పెళ్లి చేసుకున్నారు. ఆ పెళ్లి ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నారు. అంతే..ఆ ఫొటోలు, వారి ప్రేమ, పెళ్లి యువకుడి బాబాయిపై ఏకంగా కత్తులు, కర్రలతో దాడిచేసే స్థాయికి తీసుకెళ్లింది. ఆ ప్రేమజంట వివాహానికి పెళ్లికొడుకుకు వరుసకు బాబాయి, పిన్నయ్యే వడిత్య హేమ్లా, బుజ్జి కారణమన్న అనుమానంతో పెళ్లికూతురు తరపువారు హేమ్లా ఇంటికి వచ్చి కత్తులు, కర్రలతో దాడిచేయడంతో కత్తిపోట్లకు గురయ్యాడు. అతడిని గ్రామస్థులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కూసుమంచి మండలం లోక్యాతండాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. లోక్యాతండాలో ఆ గ్రామ ఆచారం ప్రకారం మూడురోజుల పాటు హోళీవేడుకలు జరిగాయి. అందరూ సంబరాల్లో ఉన్నారు. ఈ క్రమంలో తండాకు చెందిన ఓ యువతి, అదేతండాకు చెందిన ఉపేందర్ ప్రేమించుకున్నారు.
పెళ్లికి ఇద్దరి కుటుంబసభ్యులు నిరాకరించడంతో ఎలాగైనా పారిపోయి పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గురువారం అందరూ హోళీ వేడుకల్లో ఉన్న సమయంలో గ్రామం నుంచి వెళ్లిపోయి పెళ్లిచేసుకున్నారు. ఆ ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌ల్లో పెట్టుకున్నారు. వాటిని చూసిన గ్రామస్థులు అవాక్కయ్యారు. ఇక తమకూతురు పెళ్లికి.. వరుడికి బాబాయి వరుసైన వడిత్య హేమ్లా, అతడి భార్య బుజ్జి కారణమని అనుమానించి.. యువతి తరుపు బంధువులు హేమ్లా ఇంటిపై దాడికివెళ్లారు. క్రమంలో హేమ్లా కత్తిపోట్లకు గురవడంతో ఖమ్మం తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉంది. వడిత్య బుజ్జి ఫిర్యాదుమేరకు దాడిచేసిన జర్పుల సాయిచరణ్, తేజావత్ నాగేంద్రబాబు, జర్పులహరిదాసు, జర్పుల నాగమణి, జర్పుల మస్తాన్, జర్పుల విజయ, మూడ్ బుజ్జి తదితరులపై హత్యయత్నం కేసు నమోదు చేశామని, నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

## కూకట్‌పల్లిలో వ్యభిచార ముఠా ఆటకట్టు

- దాడిచేసి పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు

**హైదరాబాద్,మార్చి7( వెలుతురు):**
కూకట్‌పల్లిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను శనివారం సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వ్యభిచార ముఠా నిర్వహిస్తున్న ఇద్దరితో పాటు మరో అయిదు మంది కస్టమర్లను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ముఠాకు చెందిన మరో ఇద్దరు మహిళలను రెస్క్యూ చేసినట్లు చెప్పారు. ఓ సమాచారం ఆధారంగా సైబరాబాద్‌కు చెందిన ఏహెచ్‌టీయూ బృందం రెయిడ్ నిర్వహించింది. సుమిత్రానగర్‌లో ఉన్న ఇండ్లపై దాడి నిర్వహించారు. రాకెట్ నడుపుతున్న వారితో పాటు కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కస్టమర్లను ఆకట్టుకుంటున్నట్లు గుర్తించారు. వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూల్ చేస్తున్నట్లు తేల్చారు. భారీ మొత్తంలో డబ్బు వసూల్ చేసినా.. బాధితులకు మాత్రం తక్కువే ఇస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com